విశాలాంధ్ర

కృష్ణా, ఎన్టీఆర్ గుంటూరు, పల్నాడు

శనివారం 06 సెప్టెంబరు 2025 8 పేజీలు

డయల్ యువర్ కలెక్టర్‌కు విశేష స్పందన

రైతుల సందేహాలు నివృత్తి చేసిన లక్ష్మీశ

విశాలాంధ్ర-విజయవాడ: జిల్లాలో ఎరువుల సరఫరా, సమస్యలపై రైతుల సందేహాలను నివృత్తి చేసేందుకు డయల్ యువర్ కలెక్టర్ వినూత్న కార్యక్రమానికి కలెక్టర్ జి.లక్ష్మీశ శ్రీకారం చుట్టారు. విజయవాడలోని కలెక్టరేట్‌లో శుక్రవారం ఉదయం 8.30 నుంచి 10.30 గంటలు వరకు కలెక్టర్ నిర్వహించిన ఈ కార్యక్రమానికి రైతుల నుంచి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమానికి జగ్గయ్యపేట, ఎ.కొండూరు, తిరువూరు, నందిగామ, గొల్లపూడి తదితర ప్రాంతాల నుంచి 45 ఫోన్ కాల్స్ వచ్చాయి. ప్రతి ఫోన్ కాల్‌ను ఆయన స్వీకరించి రైతు చెప్పిన సమస్యను విని ఆ సమస్యపై అక్కడే ఉన్న అధికారులను ఆరా తీసి, పరిష్కారానికి ఆదేశాలిచ్చారు. వ్యవసాయ శాస్త్రవేత్తల సలహా ప్రకారం... వరి నాటు వేసినప్పుడు ఒకటో విడతగా ఎకరానికి 30 కిలోలు, నాటు వేసిన 30 రోజులకు రెండో విడతగా ఎకరానికి 30 కిలోలు, నాటు వేసిన 60 రోజులకు మూడో విడతగా ఎకరానికి 30 కిలోలు వేయొచ్చన్నారు. పంట విస్తీర్ణం, విడతల వారీగా అవసరమైన ఎరువులను పంపిణీ చేసే విషయంలో ఎక్కడా ఏ రైతుకూ ఇబ్బంది లేకుండా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వదంతులు నమ్మవద్దని, కలెక్టరేట్‌లో 91549 70454 నంబరుతో కమాండ్ కంట్రోల్ రూమ్ అందుబాటులో ఉందని.. రైతులు ఫోన్ చేసి సమాచారం పొందవచ్చని కలెక్టర్ వివరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి డీఎంఎఫ్ విజయకుమారి, జిల్లా సహకార అధికారి డా. ఎస్.శ్రీనివాసరెడ్డి, మార్క్ ఫెడ్ అధికారి నాగ మల్లిక పాల్గొన్నారు.

మోతీలాల్ నగర్ నివాసుల

సమస్య పరిష్కరించాలి

పెమ్మసానికి సీపీఐ నేతల వినతి

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: స్థానిక నెహ్రూనగర్ 56వ డివిజన్ మోతీలాల్‌నగర్ జీరోలైన్ నివాసులు తమ ఇళ్లను రైల్వే అధికారులు తొలగిస్తున్న నేప థ్యంలో తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమ స్యను పరిష్కరించాలంటూ కేంద్ర గ్రామీణాభివృద్ధి అండ్ కమ్యూనికేషన్ల శాఖల సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌కు సీపీఐ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్ కుమార్, జిల్లా కార్యదర్శి కోట మాల్యాద్రి, నగర కార్యదర్శి ఆకిటి అరుణ్ కుమార్ మాట్లాడుతూ 'గత 50 ఏళ్లుగా మోతీలాల్‌నగర్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన కుటుంబాలు నివసిస్తూ కూలిపనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. రైల్వే అధికారులు మొదట 3 మీటర్ల లోపే తొలగిస్తామని చెప్పి ఇప్పుడు 15 మీటర్లకు పైగా ఇళ్లు కూల్చివేయాలని చూస్తున్నారు. ఇలా జరిగితే ప్రజలు రోడ్డుపైన పడతారు' అని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు ఇక్కడే రక్షణ కల్పించాలని, లేకపోతే నగరంలోని ఖాళీగా ఉన్న టిడ్కో ఇళ్లు వారికి కేటాయించాలని డిమాండ్ చేశారు. వారి సమస్యను మానవతా దృష్టితో పరిశీలించి తక్షణ చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మేడా హనుమంతరావు, నగర సహాయ కార్యదర్శి రావుల అంజిబాబు, నగర కార్యవర్గ సభ్యులు విరిగినేని వెంకటేశ్వరరావు, నాయకులు నూతలపాటి చిన్న పాల్గొన్నారు.

కుల గణన పూర్తి చేసి స్థానిక ఎన్నికలకు వెళ్లాలి 3 లో ...

దేశానికే ఆదర్శం కానున్న క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్ 4 లో ...

రాష్ట్ర చేనేత సహకార సంఘాల యాత్ర జయప్రదం చేయండి 6 లో ...

ఆటో కార్మికుల ఆకలి కేకలు పట్టించుకోని ప్రభుత్వం 7 లో ...

ఆటో డ్రైవర్లకు జీవనోపాధి

కల్పించాలి: ఏఐటీయూసీ

విశాలాంధ్ర-సత్తెనపల్లి : రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడంతో ఉపాధి కోల్పోయిన ఆటో డ్రైవర్లకు రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలో ఉద్యోగాలు ఇవ్వాలి. ఆర్టీసీలో కండక్టర్లు, డ్రైవర్లు, మెకానిక్ పోస్టులు రవాణా శాఖ ఆర్ అండ్ బీ, మున్సిపల్ ఆఫీసుల్లో అటెండర్స్ ఆఫీస్ బాయ్స్‌గాను, పోలీస్ హోంగార్డు ఉద్యోగాలు ఇచ్చి డ్రైవర్ల కుటుంబాలను ఆదుకోవాలని ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) సత్తెనపల్లి ఏరియా సమితి గౌరవ అధ్యక్షులు, న్యాయవాది నరిశెటీ వేణుగోపాల్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పల్నాడు జిల్లా సత్తనపల్లి పట్టణంలోని అమరావతి ఆటో పాయింట్లు ఆటో యూనియన్ కరపత్రాలు ఆవిష్కరణ సందర్భంగా ఆటో డ్రైవర్ల సభలో వేణుగోపాల్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రైవేట్ సంస్థలకు ఇచ్చిన ఓలా, ఉబర్, రాపిడో వాహనాలకు ఇచ్చిన అనుమతులను రద్దు చేసి ప్రభుత్వం యాప్‌తో నడిపించాలని రాష్ట్రవ్యాప్తంగా అన్ని రైల్వేస్టేషన్‌లు, బస్ స్టాండ్‌ల్లో ఓలా, ఉబర్, రాపిడో, టు వీలర్ మోటార్ సైకిల్ నిషేధించి ఆటో డ్రైవర్లకు జీవించే హక్కు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు కంబాల శ్రీనివాస్ మాట్లాడుతూ డ్రైవర్ల హక్కుల సాధనకు పోరాటాలు చేయాలని అని అన్నారు. ప్రభుత్వాలు కళ్ళు తెరిపించండి, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు భారీగా పెంచిన నిత్యావసర వస్తువులు బియ్యం, పప్పులు, కాయకూరలు, వంట నూనె, వంట గ్యాస్, విద్యుత్తు చార్జీలు భారీగా పెంచి డ్రైవర్లకు ఒక పూట కడుపునిండా తిండి లేకుండా చేస్తూ, మరొకవైపు రాజకీయ నాయకులు ఎమ్మెల్యేలు, ఎంపీలు మంత్రులకు లక్షల్లో జీతాలు, వేలల్లో పెన్షన్లు ఇస్తున్న ప్రభుత్వాన్ని నిలదీయండని కోరారు. పేద వారైనా డ్రైవర్ల కుటుంబాలపై ఆర్థిక భారాలు వేస్తూ ఉన్న ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించండి మన హక్కుల

మిగతా 2 లో

యూరియాపై వైసీపీ దుష్ప్రచారం: మంత్రి

విశాలాంధ్ర-మచిలీపట్నం టౌన్ : గత కొన్ని రోజులుగా వైసీపీ యూరియా కొరత ఉందని రైతుల వద్ద దుష్ప్రచారం చేస్తున్నారని కృష్ణాజిల్లా ఇన్చార్జ్ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆరోపించారు. మచిలీపట్నంలో జిల్లాస్థాయి గురుపూజోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం మీడియాతో మాట్లాడుతూ కృష్ణాజిల్లాలో యూరియా కొరత లేదని, వైసీపీ ప్రచారంతో రైతులు కొరత వస్తుందని ఊహించుకొని ఎక్కువ శాతం నిల్వ ఉంచుకోవడంతో ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. పది రోజుల్లో 4 వేల మెట్రిక్ టన్నుల యూరియా కృష్ణా జిల్లాకు రాబోతోందని రైతులు అధైర్యపడవద్దని స్పష్టం చేశారు. అధిక మోతాదులు యూరియా వాడవద్దని రైతులకు ఆయన సూచించారు.

గురువులు మహోన్నతులు: క్రిస్టీనా

2 లో

ఆటో డ్రైవర్లకు జీవనోపాధి కల్పించాలి

(మొదటి పేజీ తరువాయి) సాధనకు పోరాడండని కోరారు. డ్రైవర్ల డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. చంద్రబాబు నాయుడు డ్రైవర్లకు ఇచ్చిన హామీ ప్రకారం రూ.15 వేలు ఆర్థిక సహాయం వెంటనే ఇవ్వాలని కోరారు. ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవ సలహాదారులు వి.లక్ష్మీ చెన్నకేశవ మాట్లాడుతూ డ్రైవర్ల కుటుంబ రక్షణకు పీఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్‌తో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి అమలు చేయాలని కోరారు. ఆటోలు, వ్యాన్లు, జీపులు, కార్లు, ఫిట్నెస్, డ్రైవింగ్ లైసెన్స్ ఎల్‌ఎల్‌ఆర్ చేయుటకు ప్రభుత్వం ప్రైవేటు ఏజెన్సీలకు ఇచ్చిన అనుమతులను రద్దుచేసి ప్రభుత్వ ఆధ్వర్యంలో ఎఫ్‌సీ, ఎల్‌ఎల్‌ఆర్ డ్రైవింగ్ లైసెన్స్‌లు చేయాలని, పెనాల్టీలు పెంచే 894 గెజిట్ నోటిఫికేషన్, జీవో నెంబర్ 21, 31 రద్దు చేయాలని కోరారు. చదువుకున్న అర్హులైన ఆటో డ్రైవర్లకు ఆర్టీసీలో కండక్టర్లు, డ్రైవర్లు, మెకానిక్ ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. ఆటో యూనియన్ పట్టణ అధ్యక్షులు డీఆర్ మస్తాన్ మాట్లాడుతూ కొత్త ఆటో కొనుగోలుకు జాతీయ బ్యాంకుల నుంచి ఐదు శాతం వడ్డీతో రుణాలు మంజూరు చేయాలని, సహజ మరణానికి రూ.5 లక్షలు, చంద్రన్న ప్రమాద బీమా రూ.10 లక్షలు డ్రైవర్లకు వెంటనే వర్తింపు చేయాలని అన్నారు. భారీగా పెంచిన డీజిల్, పెట్రోల్, సీఎన్‌జీ గ్యాస్ థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ రోడ్ టాక్స్ టోల్ ప్లాజా ఫీజులను 30 శాతానికి తగ్గించాలని కోరారు. ప్రమాదకరంగా ఉన్న గ్రామీణ ప్రాంత రోడ్లను పక్కాగా వేసి ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాలని కోరారు. జిల్లాలో ఆటోలకి 60 కిలో మీటర్లలోపు ఎఫ్‌సీ చేయాలని, అర్హులైన ఆటో డ్రైవర్లకు ప్రభుత్వం నిర్మించిన ఇల్లు ఇవ్వాలని కోరారు. 60 సంవత్సరాలు దాటిన డ్రైవర్లకు నెలకి రూ.8 వేలు వృద్ధాప్య పెన్షన్ ఇవ్వాలన్నారు. ఆటో డ్రైవర్ల పిల్లలకు ఉన్నత చదువుకు ప్రభుత్వం 50 శాతం రాయితీ ఇవ్వాలని, అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రిలో డ్రైవర్ల కుటుంబ సభ్యులకు ఉచిత వైద్యానికి ఆరోగ్యశ్రీ కార్డులు ఇవ్వాలని, ప్రైవేటు ఫైనాన్సర్లు వేస్తున్న అధిక వడ్డీలు రద్దు చేయాలని కోరారు. ఆటోలు, వ్యానులు, జీపులు, కార్లపై ఉన్న పాత పోలీస్ ఆర్టీవో ఈ-చలానాలు రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు షేక్ మహబూబ్. డి.బాబు. ఏ.రమేష్. చిలక జిప్సను. శీను, మేకా కోటేశ్వరరావు, చెన్నారావు. కిరణ్. రామయ్య. జాను. శంకర్, కె.శ్రీనివాసు పాల్గొన్నారు.

నేటి నిరసనలను జయప్రదం చేయాలి

వామపక్ష పార్టీల పిలుపు

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: ఈ నెల 6న అమెరికా టారిఫ్‌ల పెంపునకు వ్యతిరేకంగా జిల్లా వ్యాప్తంగా మండల కార్యాలయాల వద్ద జరిగే నిరసన కార్యక్రమాలలో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని జిల్లా వామపక్ష పార్టీల నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక కొత్తపేటలోని సీపీఐ కార్యాలయం మల్లయ్య లింగం భవన్‌లో జరిగిన వామపక్ష పార్టీల విలేకరుల సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కోటామాల్యాద్రి, సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ, సిపిఐ ఎం.ఎల్ ప్రజాపోరు జిల్లా కార్యదర్శి పాటిబండ్ల కోటేశ్వరరావు, ఏఐఎఫ్టీయు న్యూ జిల్లా నాయకులు కూరపాటి కోటయ్య మాట్లాడారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారతీయ సరుకుల దిగుమతులపై సుంకాన్ని 50శాతం పెంచడం వలన మన ఉత్పత్తులపై తీవ్రమైన దుష్ప్రభావం పడుతుందన్నారు. ఆక్వా, ఫార్మా, టెక్స్‌టైల్స్, గార్మెంట్స్ తదితర రంగాలపై తీవ్ర ప్రభావం చూపుతోందని వామపక్ష పార్టీలు విమర్శించాయి. రొయ్యల ధరలు పడిపోవడంతో తీరప్రాంత రైతులు సంక్షోభంలో ఉన్నారని, మిల్లులు, గార్మెంట్ ఫ్యాక్టరీల్లో వేలాది మహిళా కార్మికుల ఉపాధి ప్రమాదంలో ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అమెరికా వీసా నిబంధనల కఠినతరం కారణంగా విద్యార్థుల భవిష్యత్తు కూడా దెబ్బతింటోందని పేర్కొన్నారు. కేంద్రంలో మోడీ అధికారంలోకి వచ్చాక భారత ప్రయోజనాల్ని, దేశసార్వభౌమత్వాన్ని అమెరి కాకి తాకట్టు పెట్టే విధంగా వ్యవహరిస్తున్నారు. రాష్ట్ర ప్రయోజనాలు కాపాడేందుకు కూటమి ప్రభుత్వం కూడా ఏమాత్రం ప్రయత్నించకపోవడం సరికాదన్నారు. అమెరికా సామ్రా జ్యవాదానికి వ్యతిరేకంగా, దేశ సార్వభౌమత్వ రక్షణ కోసం శనివారం జిల్లా వ్యాప్తంగా జరిగే నిరసన కార్యక్రమాలలో దేశ భక్తి కలిగిన పౌరులందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మేడా హనుమంతరావు, నగర కార్యదర్శి ఆకిటి అరుణ్‌కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు పుప్పాల సత్యనారాయణ, నగర సహాయ కార్యదర్శి రావుల అంజిబాబు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కొల్లి రంగారెడ్డి, డివైఎఫ్ఐ నాయకులు వై.కృష్ణకాంత్, సిపిఐ నగర కార్యవర్గ సభ్యులు బి.వెంకటేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గురువులు మహోన్నతులు: క్రిస్టీనా

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: ప్రపంచంలోని అత్యున్నత స్థానాలను అధిరోహించేలా విద్యార్థులను తీర్చిదిద్దగల మహోన్నతమైన వారు విద్యనేర్పించే గురువులు అని జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ కత్తెర హెని క్రిస్టీనా తెలిపారు. శుక్రవారం స్థానిక రెవెన్యూ కళ్యాణ మండపంలో జరిగిన గురుపూజోత్సవం 2025 వేడుకలు నిర్వహించారు. మాజీ రాష్ట్రపతి డా.సర్వేపల్లి రాధ కృష్ణన్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజా పరిషత్ క్రిస్టీనా మాట్లాడుతూ ఉపాధ్యాయునిగా, ఉప రాష్ట్రపతిగా, రాష్ట్రపతిగా డా.సర్వేపల్లి రాధ కృష్ణ డా.సర్వేపల్లి రాధ కృష్ణన్ దేశానికి ఎనలేని సేవలు అందించారని, ఆయన జన్మదినాన్ని దేశ వ్యాప్తంగా ఉపాధ్యాయుల దినోత్సవంగా జరుపుకుంటూ ఆయన స్ఫూర్తిని, ఆశయాలను గర్వంగా స్మరించుకుంటున్నామన్నారు. విద్యావంతులుగా తీర్చిదిద్దే గురువును తల్లి, తండ్రి తరువాత దేవుడు కంటే ముందుగా నమస్కారం తెలిపి గౌరవించే సంప్రదాయం మన దేశంలో ఉందన్నారు. గురువులు తరగతిగదులలో చేస్తున్న కృషి, ప్రోత్సాహం వలనే సమాజంలో ఎంతో మంది ఉన్నత స్థాయిలో జీవిస్తున్నారన్నారు. శాసనమండలి సభ్యులు ఆలపాటి రాజేంద్రప్రసాదు మాట్లాడుతూ మాజీ రాష్ట్రపతి, భారతరత్న డా.సర్వేపల్లి రాధ కృష్ణన్ ఆశయాలను, ఆలోచనలు ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. శాసనసభ్యులు గళ్లా మాధవి మాట్లాడుతూ సమాజంలో స్థితిగతులను మార్చే అంశాల్లో ఉపాధ్యాయులు అందించిన సూచనలను అమలుకు తన వంతు సహకారం అందిస్తామన్నారు. కమిషనరు పులి శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రకాశం జిల్లాలో మారుమూల కుగ్రామానికి చెందిన తనని ఐఎఎస్ స్థాయి అధికారిగా ఎదగటానికి తనకు విద్యనేర్పిన గురువులే కారణం అని తెలిపారు. రాష్ట్ర టెక్నలజీ సర్వీసెస్ చైర్మన్ మన్నవ మోహన కృష్ణ, జిల్లా విద్యాశాఖ అధికారిణి రేణుక, డిప్యూటీ మేయరు సజీలా మాట్లాడారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని వేదికపై ప్రత్యేక ఆసనంపై కూర్చోపెట్టి, శాలువ, మెమొంటో, ప్రశంస పత్రం, గిఫ్ట్ బాక్స్ తో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈఓలు శాంతకుమారి, ఏసురత్నం, ఎంఈఓలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల ఉద్యమ బాట

జేఏసీ సమావేశంలో నేతల నిర్ణయం

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి : విజయవాడ ఏలూరు రోడ్డులోని గుణదల వద్ద ఉన్న 1104 కార్యాలయంలో విద్యుత్ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం కీలక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో విద్యుత్ ఉద్యోగుల నాయకులతో పాటు కాంట్రాక్ట్ కార్మిక సంఘాల ప్రతినిధులు కూడా పాల్గొన్నారు. కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను ఏఐటీయూసీ నాయకులు బాలకాశి, కట్టా నాగరాజు, నాగార్జున ప్రస్తావించగా, విద్యుత్ ఉద్యోగుల జేఏసీ తరపున చైర్మన్ ఎస్. కృష్ణయ్య, కన్వీనర్ రాఘవ రెడ్డి, శేషారెడ్డి, గోపాలరావు, కో-చైర్మన్ పొన్నా శివయ్య, అన్నే శ్రీనివాస్ కుమార్, ఓసి శ్రీనివాస్, బంగారయ్య, జగదీశ్వర్, శోభనాద్రి, నాగేశ్వర్ నాయక్ తదితరులు మాట్లాడారు. సమావేశంలో విద్యుత్ రంగంలో ఉద్యోగ భద్రత, కాంట్రాక్టు కార్మికుల వేతనాలు, శాశ్వతీకరణ, డైరెక్ట్ పేమెంట్ అరియర్స్, అలాగే ప్రైవేటీకరణ వ్యతిరేక పోరాటాలపై విస్తృతంగా చర్చించారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని నేతలు డిమాండ్ చేశారు. ఉద్యోగుల ఐక్యబలం మరింత పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టంచేస్తూ, సమగ్ర ఉద్యమ కార్యక్రమాలను ఖరారు చేయాలని నిర్ణయించారు. రాబోయే రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికుల పోరాటం మరింత ఉధృతం కానుందని నేతలు హెచ్చరించారు. విజయవాడలో జరిగిన ఈ ఉమ్మడి సమావేశం విద్యుత్ ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికుల్లో ఐక్యతా స్ఫూర్తిని పెంపొందించిందని నేతలు పేర్కొన్నారు.

మసీద్ నిర్మాణానికి 100 ఎకరాలు కేటాయించాలి

విశాలాంధ్ర-మంగళగిరి : రాజధాని అమరావతిలో జుమ్మ మసీద్ నిర్మాణానికి 100 ఎకరాల భూమిని కేటాయించాలని నవరంగ్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు షేక్ జలీల్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విజయవాడలో మీడియాతో మాట్లాడుతూ ఆయన గాలిబ్ షాహిద్ దర్గా భూములను ఇళ్ల నిర్మాణానికి ముస్లింలకు ఇవ్వాలని, విద్యా-ఉద్యోగ రంగాల్లో 12 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరారు. ముస్లిం మహిళలకు దుల్హాన్ పథకం కింద లక్ష రూపాయలు, ఇమామ్-మౌజన్ లకు ఇళ్లు, వితంతువులకు పెన్షన్, వక్ఫ్ భూములను ముస్లింలకే కేటాయించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచించారు. జుమ్మ మసీదు నిర్మాణానికి వెయ్యి కోట్లు నిధులు విడుదల చేసే బాధ్యతను అంజుమన్ ఇస్లామిక్ కమిటీకి అప్పగించాలని, అమరావతిలో హజ్ హౌస్ కోసం రూ.500 కోట్లు కేటాయించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ముస్లింల అభివృద్ధి కోసం రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహిస్తున్నామని, అందరూ పాల్గొని విజయవంతం చేయాలని షేక్ జలీల్ పిలుపునిచ్చారు.

అలీనగర్‌ను దుగ్గిరాల పంచాయతీలో కలపాలి

విశాలాంధ్ర-దుగ్గిరాల : శివారు అలీ నగర్ నీ దుగ్గిరాల పంచాయతీలో కలపాలని ముస్లిం నాయకులు కోరారు. అలీనగర్ లో 45 గృహాలు తెనాలి మండలం కొలకలూరు పరిధిలో ఉందని వెళ్లాలంటే ఇబ్బంది కరంగా మారుతుందని వారు వాపోయారు. నాయకులు స్పందించి దుగ్గిరాల పంచాయతీలో గృహాలను కలపాలని వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పఠాన్ జున్నుఖాన్, హాజీ సుభాని, ఎండి సాదిక్,ఖురేషి, ఎండి ఉస్మాన్, షేక్ బాషా, పలువురు పాల్గొన్నారు.

PUBLIC NOTICE

Under the instruction of my client Guduru Koteswara Rao, S/o. Late Krishna Rao, R/o.Flat No. 302, Harika Villa, 1st Lane, Shanthi Nagar, Sai Adithya School Road, Koritepadu, Guntur as here under. My client is the sole holder of the securities as detailed : **Name of the Company:** Lotus Chocolate Company Limited, **Folio No: LCC034929,**

Certificate Number & Distinctive Number:

1) 14776 - 2507501 to 2507600,
2) 24363 - 3466201 to 3466300,
3) 32471 - 4277001 to 4277100,
4) 30196 - 4049501 to 4049600,
5) 30031 - 4033001 to 4033100,
6) 18427 - 2872601 to 2872700.

Number of Securities and Face Value: 600 Shares

For the purpose of zerox copies, my client had been to Brundavan gardens on his motor cycle and opened his bag and found missing of the above said original share certificates in his bag. He searched en-route from Brundavan gardens to his house and Xerox shop, but my client could not traced it, If any one found the same, may be returned to either me or my client.

YADLAPALLI KOTESWARA RAO, Advocate, 2/18 Brodipet, Guntur. Cell: 9397107449 Guntur. Dt:05-09-2025

PUBLIC NOTICE

Under the instruction of my client Guduru Ramesh Kumar, S/o. Late Krishna Rao, R/o. Flat No.404, Sabarigiri Towers, 7th Lane, 2nd Cross Road, Chandramouli Nagar, Guntur as here under. My client is the sole holder of the securities as detailed **Name of the Company:** Lotus Chocolate Company Limited, **Folio No:** LCC034944,

Certificate Number & Distinctive Number:

1) 1652 - 2135101 to 2135200,
2) 1653 - 2135201 to 2135300,
3) 1654 - 2135301 to 2135400,
4) 2655 - 2235401 to 2235500,
5) 23714- 3401301 to 3401400,
6) 26385- 3668401 to 3668500.

Number of Securities and Face Value: 600 Shares

For the purpose of zerox copies, my client had been to Brundavan gardens on his motor cycle and opened his bag and found missing of the above said original share certificates in his bag. He searched en-route from Brundavan gardens to his house and Xerox shop, but my client could not traced it, If any one found the same, may be returned to either me or my client.

YADLAPALLI KOTESWARA RAO, Advocate, 2/18 Brodipet, Guntur. Cell: 9397107449 Guntur. Dt:05-09-2025

నోటీసు ప్రకటన

మహారాజశ్రీ వినుకొండ జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో

ఓ.ఎస్.నెం.88/2025

పిటీషన్:-

ఐంటి ఆంజనేయులు, తండ్రి : చిన్న వెంకటేశ్వర్లు, హిందు, వ్యవసాయం, చిరునామా : డోర్ నెం.2-55/ఏ, ములకలూరు గ్రామం, నూజెండ్ల మండలం, పల్నాడు జిల్లా. - వాది

మరియు

కోయ శ్రీనివాసరావు, తండ్రి : చంద్రయ్య, హిందు, వ్యవసాయం, చిరునామా : డోర్ నెం. 3-21, ములకలూరు గ్రామం, నూజెండ్ల మండలం, పల్నాడు జిల్లా. - ప్రతివాది

పై నంబరు దావాలోని ప్రతివాది అయిన నీపై ప్రోనోటు బాకీ వసూలు నిమిత్తం దావా దాఖలు చేసి పై కోర్టువారి ద్వారా మరియు రిజిష్టరు పోస్టు ద్వారా సమన్లు జారీ చేసినను నీవు వానిని తీసుకొనందున శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం తెలియజేయునది ఏమనగా **ది. 11-09-2025న ఉదయం 10.30 గంటలకు** నీవు స్వయంగాను లేక నీ న్యాయవాది ద్వారాను పై కోర్టుకు హాజరు కావలెనని, లేని యెడల దావాను శ్రీ కోర్టు వారు మీ పరోక్షముగా తీర్పు చెప్పగలరని ఇందు మూలంగా ఈ ప్రకటన ద్వారా తెలియజేయటమైనది.

వాయిదా : ది. 11-09-2025

పి. సైదారావు, అడ్వకేట్, వినుకొండ,
సెల్: 9440825595.

BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS, GUNTUR

DISPUTE NO: 47/2024

Between:

M/s Margadarsi Chit Fund Pvt. Ltd, Pep. by its Senior Manager, Arundelpet Branch Guntur .... Disputant

And

MR. Shaik Buran Shareef & Others .... Opponents

Opponent No . 3 :
Mr. Shaik Mahaboob Subhani, S/o. Abdul Kareem, Signal Maintainer, O/o. SSE/Signal/S.C.Railway, Piduguralla (PO&M), Palnadu Dist.

Opponent No . 4 :
Mr. Shaik Ameer Basha, S/o. Mastan Saheb, Head Cashier-II cum Clerk, Union Bank of India, Main road, Opp. Bus Stand, Sattenapalli (PO&M), Palnadu Dist.

Opponent No . 6 :
Mrs. Vunnam Madhavi Latha, W/o. B. Sambasivarao, Sec. Gr. Teacher, Mpl. Primary School, Patel Nagar, Bapatla, Bapatla Dist.

Please take Notice that the above Dispute is filed against Opponents for recovery of amount. The **Opponent No.3,4&6** has not take the court Notices from Hon'ble Depury Registrar of Chits, Guntur. Hence the suit is posted to **09-09-2025** for appearance of you before the Depury Registrar of Chits, Guntur at **10.30 A.M** by person or through an Advocate. if you are fail to attend so, the matter will be heard and decided exparte basis on the material available.

(By the Order of the Hon'ble Deputy Registrar of Chits, Guntur)

Hearting Date : 9-9-2025

FORMAN/SR.BRANCH MANAGER
M/S Margadarsi Chit Fund Pvt.Ltd., Arundelpet Branch, Guntur
9618771325, 9885181858.

కుల గణన పూర్తి చేసి స్థానిక ఎన్నికలకు వెళ్లాలి

బీసీ సంక్షేమ సంఘం

విశాలాంధ్ర-మంగళగిరి : ప్రభుత్వం తక్షణమే కుల గణన పూర్తి చేసి జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంక రరావు డిమాండ్ చేశారు. శుక్రవారం మంగళగిరి లోని రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో పారేపల్లి మహేష్‌ను రాష్ట్ర యువజన అధ్యక్షుడిగా నియమించారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లా డుతూ ఎన్నికల ముందు జయహో బీసీ అంటారు,

ఎన్నికల తర్వాత మాత్రం మా సమస్యలు పట్టించుకోవడం లేదని రాజకీయ పార్టీలను విమ ర్శించారు. బీసీ యువతను చైతన్యవంతులను చేసి హక్కుల సాధన కోసం పోరా టం చేస్తామని స్పష్టం చేశా రు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ అధ్యక్షులు కుమ్మరి క్రాంతి కుమార్, బీసీ సంక్షేమ సంఘం మహిళా విభాగం నాయకులు కాగితాల స్వాతి గౌడ్, తిరువీధుల కిరణ్, ఆలా శివాజీ యాదవ్, మంద్రు సత్యనారాయణ, జంజ నం వరప్రసాద్, కాట్రు ధనుంజయ్, ఇసునూరి నగేష్, జి.జయలక్ష్మి, కొమ్మకుల విజయభాస్కర్, నల్లబోతు సుబ్బారావు, నరసింహారావు, సిహెచ్ గోపి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను సన్మానించిన లాల్ వజీర్

విశాలాంధ్ర- గుంటూరు వైద్యం : స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు లాఫింగ్ క్లబ్ అధ్యక్షులు షేక్ లాల్ వజీర్ ఆధ్వర్యంలో శుక్ర

వారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా లాల్ వజీర్, క్లబ్ మెంబర్లు ఉపాధ్యాయులు డాక్టర్ ఎం.కవిత, పార్వతీదేవి, డాక్టర్ సంధ్య, శౌరయ్య, కిషోర్‌లను శాలువాలు, పూలదండలతో ఘనంగా సత్కరించారు. అనంతరం లాల్ వజీర్ మాట్లాడుతూ తల్లి తరువాత గురువులు దేవునితో సమానమని అన్నారు. దేశ రెండవ రాష్ట్రపతి ఎస్.రాధాకృష్ణన్ ఉపాధ్యాయులుగా పని చేశారని ఈ సందర్భంగా తెలిపారు. 1952 నుండి 64 వరకు ఉపాధ్యా యులుగా కొనసాగాలని, వారి పుట్టినరోజు సెప్టెంబర్ 5వ తేదీని ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకుంటున్నట్లు తెలిపారు. క్లబ్ మెంబర్ అబ్దుల్ ఖాదర్ మాట్లాడుతూ ఎందరో డాక్టర్లు.. ఇంజనీర్లు.. దేశ నాయకులుగా తయారు చేసేది ఉపాధ్యాయులేనని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, శివరాం ప్రసాద్, శంకరరావు, లంక మాధవి, తదితరులు మాట్లాడారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

విశాలాంధ్ర-పెదనందిపాడు : స్థానిక నంది పాఠశాలలో శుక్ర వారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి ముఖ్యఅతిథులుగా పాల్గొన్న

పెదనందిపాడు ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షులు కాళహస్తి సత్యనారాయణ, విజ్ఞాన్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వి.అనురాధాలు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. పాఠశాలలోని ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులకు నైతిక విలువలతో కూడిన విద్యను అందించి వారి భవిష్యత్తుకు బంగారు బాట వేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పీఏఎస్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గుర్రం వీరరాఘవయ్య, ప్రధానోపా ధ్యాయుడు పోపూరి రామాంజనేయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర-ప్రత్తిపాడు : రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక రెయిన్‌బో స్కూల్‌లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.

ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు చిన్నం శ్రీనివాసరావు, కార్యదర్శి పోపూరి నాగేశ్వరరావు, క్లబ్ మాజీ అధ్యక్షుడు విక్టర్ జాన్ పాల్, సభ్యులు షేక్ సిద్దాసాహెబ్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పింఛన్లు, రేషన్ కార్డుల కోసం మంత్రికి వినతి

విశాలాంధ్ర-తెనాలి : బోసురోడ్డులోని జనసేన కార్యాలయంలో శు క్రవారం ప్రజల వద్ద నుంచి మంత్రి నాదెండ్ల

మనోహర్ అర్జీలను స్వీకరించారు. నియోజవర్గ పరిధిలోని ప్రజలు పింఛన్లు, రేషన్‌కార్డులు వంటి వివిధ సమస్యలపై ఆయనకు వినతిపత్రాలను అందజేశారు. వాటిని పరిశీలించి వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని ప్రజలకు ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

కొల్లిపరలో స్మార్ట్‌రేషన్ కార్డుల పంపిణీ

తెనాలి నియోజకవర్గ పరిధిలోని కొల్లిపర మండలంలో మంత్రి మనోహర్ ఇంటింటికి వెళ్ళి స్మార్ట్ రేషన్‌కార్డులు పంపిణీ చేశారు. ఈ గ్రామంలో అత్యధికంగా 19వేల స్మార్ట్ రేషన్‌కార్డులు పంపిణీ చేయనున్నట్లు మంత్రి మనోహర్ తెలిపారు. కొత్త కార్డులు పొందనవారు కూడా ఈ నెల రేషన్ తీసుకోవచ్చని చెప్పారు. మూడో విడత గ్యాస్ బుకింగ్ ద్వారా వచ్చిన గ్యాస్ సిలిండర్లు లబ్ధిదారులకు అందజేశారు. ఎంపిడిఓ విజయ లక్ష్మి, తహశీల్దార్ సిద్దర్థ, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మంచినీటి ట్యాంక్ నిర్మాణానికి శంకుస్థాపన

విశాలాంధ్ర-దుగ్గిరాల: గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదు రుగా ఉన్న స్థలంలో శుక్రవారం సురక్షిత మంచినీటి ట్యాంక్ నిర్మాణానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు శంకుస్థాపన కార్య

క్రమం నిర్వహించారు. మొత్తం 20 సెంట్లు స్థలంలో రూ.4.7 కోట్ల నిధులతో ఇంటింటికి రక్షిత నీటిని అందించే పనులకు భూమి పూజ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బాణావత్ ఖుషి బాయ్, ఎంపీపీ షేక్ జబీన్, మార్కెట్ యార్డ్ చైర్మన్ ఉన్నం ఝాన్సీరాణి మండల పార్టీ అధ్యక్షురాలు కేసనేని శ్రీ అనిత, రాష్ట్ర వాణిజ్య భాగం ప్రధాన కార్యదర్శి గూడూరు వెంకటరావు, మండల జనసేన పార్టీ అధ్యక్షులు పసుపులేటి శ్రీనివాసరావు, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ కొంగార జోగేంద్రప్రసాద్,నియోజకవర్గ తెలుగు నాడు ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు వల్లూరు నరసింహారావు,దోస్త్ అధ్యక్షులు మిక్కిలినేని గాంధీ, సభ్యులు గద్దె వాసు,నక్కా చిరంజీవి,షేక్ బాషా, ఎండి ఫిరోజ్ పాల్గొన్నారు.

వైభవంగా గణేష్ నిమజ్జనం

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: స్థానిక హౌసింగ్ బోర్డ్ కాలనీ నందు గల ఎస్.ఆర్.కె యూత్ వారి గణేష్ నిమ జ్జన కార్యక్రమం గురువారం వైభవంగా నిర్వహిం చారు. సీనియర్ జర్నలిస్టు చెవుల శ్రీనివాసరావు ఆధ్వ ర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వందలాది మంది భక్తుల నడుమ గణపతి లడ్డు వేలం పాట, నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. గణేష్ లడ్డూ వేలం పాటలో రూ.1.70లక్షలకు స్థానికులు సొంతం

చేసుకోవడం విశేషం. వారు మాట్లాడుతూ నిమజ్జన కార్యక్రమం ఘనంగా నిర్వహించా మన్నారు. ఈ కార్యక్రమంలో సాగి చక్రధర్, సీవీఆర్ అనిల్, కార్తీక్, షన్ను, అన్నపురెడ్డి విజయభాస్కర్ రెడ్డి, బ్యాంక్ మేనేజర్ లక్ష్మణ్, పగడాల సుబ్బారెడ్డి, పెద్దిరెడ్డి, వెంకట్ రెడ్డి, మామిడి రాము, చెవుల రామోజీ, ఓంకార్, నాగూర్ తదితరులు పాల్గొన్నారు.

దర్గా అభివృద్ధికి చర్యలు

విశాలాంధ్ర-పెద కాకాని : మండల కేంద్రమైన పెదకాకాని లోని బాజీ బాబా దర్గా అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర

వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ ఆదేశాల మేరకు శుక్రవారం దర్గా చుట్టూ ఉన్న మట్టి రోడ్లపై డస్ట్ తోలించి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు దర్గా ఈఓ షేక్ కాజా మస్తాన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో షేక్ బాజీ, షేక్ సిలార్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైనది: మున్ను

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైనదని, ఏ వృత్తిలో రాణించాలన్నా గురువుల

పాత్ర అమూల్యమైనదని జైన్ హైస్కూల్ డైరెక్టర్ డాక్టర్ మహమ్మద్ మున్ను అన్నారు. స్థానిక సంగడిగుంటలోని జైన్ హైస్కూల్‌లో శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మున్ను మాట్లాడుతూ మనం నేర్చుకున్న జ్ఞానం, నైపుణ్యాలను సరైన మార్గంలో నడిపించేవారే గురువు అని అన్నారు. ఉపాధ్యాయుల కృషి లేకుండా సమాజం ముందుకు సాగదన్నారు. విద్య, క్రమశిక్షణ, నైతిక విలువలను కలిపి విద్యార్థుల్లో సుసంస్కారాన్ని నాటేది ఉపాధ్యాయుడేనని, ఉపాధ్యాయ దినోత్సవం మనందరికీ ఈ సత్యాన్ని గుర్తు చేస్తుందని అన్నారు. ప్రిన్సిపాల్ పి.కనకదుర్గ మాట్లాడుతూ డైరెక్టర్ మహమ్మద్ మున్ను ఉపాధ్యాయులను ప్రోత్సహిస్తూ, విద్యార్థుల భవిష్యత్తు కోసం కొత్త ఆవిష్కరణలు, కొత్త మార్గాలను అన్వేషిస్తూ స్కూల్‌ను అభివృద్ధి దిశగా తీసుకువెళ్తున్నారు. ఆయన నాయకత్వం వల్లే జైన్ హైస్కూల్ ఈ ప్రాంతంలో విశిష్ట స్థానాన్ని సంపాదించింది అని ప్రశంసించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మున్నుని ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సత్కరించారు.

బహిరంగ ప్రకటన

నా క్లయింటు అయిన యన్.టి.ఆర్. జిల్లా, విజయవాడ పట్టణం, చంద్రమౌళిపురం, శ్రీరామ్‌నగర్, డోర్.నెం.40-26-10ఎ కాపురస్తురాలు లేటు మాగంటి దుర్గాప్రసాద్ గారి భార్య శశికళ గారి నుండి సంజాయిషీ పొంది యావన్మందికీ తెలియజేయునది ఏమనగా, నాక్లయింటు భర్తగారు అయిన మాగంటి దుర్గాప్రసాద్ మరియు తన స్నేహితుని భార్య అయిన దొండేటి వెంకట ఝాన్సీ లక్ష్మి ఇరువురులకు కలిసి ది.12-05-2003వ తేది షెడ్యూలు దాఖలా ఆస్తిని గుంటూరు కాపురస్తురాలు అయిన అందె వెంకట అప్పారావు గారి భార్య అందె సావిత్రి గారి వద్ద షెడ్యూలు దాఖలా ఆస్తిని కొనుగోలుచేసి మంగళగిరి సబ్.రిజిస్ట్రారు కార్యాలయము నందు విక్రయ దస్తావేజు నెం.2728/2003గా రిజిష్టరు చేయించి ది.25-09-2022వ తేది మరణించినారు. నా భర్త మరణించిన తరువాత నుండి షెడ్యూలు దాఖలా ఆస్తి ఝాన్సీలక్ష్మిల స్వాధీనానుభవంలో వున్నది. షెడ్యూలు దాఖలా ఆస్తికి సంబంధించిన ఒరిజినల్ విక్రయ దస్తావేజు నెం.2728/ 2003ను మాక్లయింటు జిరాక్స్‌తీసుకొను నిమిత్తం కృష్ణలంక తీసుకొని వెళ్ళుచుండగా మార్గమధ్యములో సదరు ఒరిజినల్ దస్తావేజు పోయినది. మాక్లయింటు ఎంత వెతికినా దొరకలేదు. కావున తమరు నా యందు దయవుంచి మా యొక్క ఒరిజినల్ విక్రయు దస్తావేజు నెం.2728/2003ను యస్.ఆర్.ఓ. మంగళగరి ది.12-05-2003ను వెతికించి దొరికిన యెడల ఇప్పించవలసినదిగా ప్రార్థించుచున్నాను.

షెడ్యూలు:గుంటూరు డి॥, మంగళగిరి సబ్.డి॥ యిలాకా, మంగళగిరి మున్సిపల్ ఏరియాలో చేరిన, మంగళగిరి గ్రామం తాలూకు డి.నెం.57/1వ లెటరు య.12-36సెంట్లు మింజుమలె విక్రయభూమికి హద్దులు:**తూర్పు:**దివి రమాదేవి గారి భూమి హద్దు,**దక్షిణం:**కొల్లి సాంబశివరావుగారి భూమి హద్దు, **పడమర:** షేక్ కరిముల్లా గారి భూమిహద్దు, **ఉత్తరం:** దేవుని మాన్యం భూమి హద్దు. ఈ హద్దుల మధ్య య.1-00సెంట్లు మెరక భూమి మాత్రం. ఈ భూమికిగల యావత్ ఈజ్‌మెంట్ హక్కులతో సహా.

ఉయ్యూరు బాపిరెడ్డి, ఈమని గోవరలక్ష్మీ,
ఈమని అశోక్ రెడ్డి, అడ్వకేట్స్
మంగళగిరి, గుంటూరు జిల్లా. సెల్: 9247768630

ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర-తెనాలి: పట్టణంలోని వీఎస్ఆర్ అండ్ ఎన్‌వీఆర్ కళాశాలలోని ఆడిటోరియంలో టీచర్స్ డే వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మ్యాథమెటిక్స్ ప్రొఫెసర్ డా.ఎ.గంగాధరరావు మాట్లాడుతూ సమాజాన్ని తీర్చిదిద్దేందుకు విద్యార్థుల్లో విజ్ఞానాన్ని పెంపొం దించేందుకు ఉపాధ్యాయులు నిర్విరామ కృషి చేయాలన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిన్నతనం నుంచి తెలివితేటలతో మెలిగి ఉత్తమ ఉపాధ్యా యుడిగా సేవలు అందించి రాష్ట్రపతి స్థాయికి ఎదిగారని చెప్పారు. నేటి బాలలు ఆయనను స్ఫూర్తిగా తీసుకొని ఉత్తమ స్థాయికి ఎదగాలని హితవు పలికారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.నన్నపనేని సుగుణ గౌరవ అతిథిగా మాట్లా డుతూ నేడు అనేకమంది మహిళలు గవర్నర్లుగా వెలుగొందుతున్నారని వారి స్థాయికి ఎదిగేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో డా.ఈ. శీలా, విఎస్ఆర్ ఇంజ నీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డా.విజయప్రకాష్ అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

ఏస్టీయూ ఆధ్వర్యంలో

తెనాలి పట్టణంలోని కార్యాలయ ప్రాంగణంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఎస్టీయూ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉపాధ్యాయ సంఘ నాయకులు సుబ్బారావు మాట్లాడుతూ గురువులు విద్యార్థులను ఆలోచనాత్మక పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. సమా జంలో గురువునకు ఎంతో గౌరవప్రదమైన స్థానం ఉందని చెప్పారు. విద్యార్థులను దేశభక్తులుగా ఆలోచనాత్మక పౌరులుగా గురువులకు తీర్చి దిద్దాల్సిన బాధ్యత ఉందన్నారు. విద్యార్థుల భవిష్యత్తు నిర్దేశించగల టీచర్లు దేశాభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్నారని చెప్పారు. ఎస్టీయూ రాష్ట్ర నాయకులు రామచంద్రయ్య మాట్లాడుతూ టీచర్లు చెప్పే విషయాలను విద్యార్థులు అర్థం చేసుకొని మెదడులో భద్రపరచుకోవాలని సూచించారు. నేడు విద్యార్థులు సక్రమ మార్గంలో నడవడం వలన భవిష్యత్తులో పలు విజయాలను సాధిస్తారని చెప్పారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ గొప్ప ఉపాధ్యాయులని ఫిలాసఫర్ అని కొనియాడారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు రోల్‌మోడల్‌గా ఉండాలని వారి లక్ష్యాన్ని సాధించేలా మార్గనిర్దేశం చేయాలని సూచించారు.

'సుమేధ'లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: స్థానిక ఎన్జీజీవోస్ కాలనీలో సుమే ధ హైస్కూల్ నందు గురుపూ జోత్సవ వేడుకలు ఘనంగా నిర్వ

హించారు. ఈ సందర్భంగా స్కూల్ డైరెక్టర్ మున్నంగి చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ ఆధునిక సమాజంలో ఉపాధ్యాయుని పాత్ర ఎంతో ముఖ్యమైనది. సమాజ నిర్మాణంలోనూ దేశ ప్రగతిలోను విద్యకు ఉన్నత స్థానం ఉందని, అలాంటి విద్యను ఉన్నత విలువలతో విద్యార్థులకు అందించే ఉపాధ్యాయుడు సమాజానికి అద్దంలాంటి వారని అన్నారు. తల్లిదండ్రులు పిల్లవానికి జన్మనిస్తే, గురువు మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థి తన ఆలోచనలు మార్చుకునే విధంగా ప్రోత్సహించాలని వివరించారు. కార్యక్రమంలో డైరెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, హెడ్ మాస్టర్ కె.రాంబాబు, ఉపాధ్యాయ బృందం డాక్టర్ సర్వేపల్లి రాధా కృష్ణకి నివాళులర్పించారు.

కృష్ణవేణిలో గురుపూజోత్సవ వేడుకలు

విశాలాంధ్ర - వినుకొండ : ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా పట్టణంలోని కృష్ణవేణి కళాశాల వారు స్థానిక నరసరావుపేట రోడ్డులోని ఓ ప్రైవేటు కళ్యాణ మండపంలో ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా గురుపూజోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థిని, విద్యార్థులు కళాశాల అధ్యాపకులను దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించి నూతన వస్త్రాలను బహుకరించారు. అనంతరం విద్యార్థిని, విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో నృత్యాలను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ బి.లింగారావు, మల్లికార్జున రావు, ప్రిన్సిపల్ ఆంజనేయులు, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవ కమిటీ వార్షికోత్సవం

విశాలాంధ్ర - వినుకొండ : వినుకొండ స్టేట్ బ్యాంక్ రోడ్ గణేష్ ఉత్సవ కమిటీ 14వ వార్షికోత్సవం అంగరంగ వైభవంగా తొమ్మిది రోజుల పాటు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా రెండు లడ్డులు వేలంపాట నిర్వహించగా మొదట పెద్ద లడ్డు పట్టణానికి చెందిన పొట్ల రాధాకృష్ణ మూర్తి కుమారుడు అమర శ్రీనివాసరావు 2 లక్షల 52 వేలకు కైవసం చేసుకున్నారు. రెండో లడ్డు మహిళలకు కేటాయించగా రామడుగు శివలక్ష్మి రూ.2 లక్షల 50 వేలకు కైవసం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో గణేష్ మహోత్సవ కమిటీ గౌరవ అధ్యక్షులు, ఉమ్మడి గుంటూరు జిల్లా జిడిసిసి బ్యాంక్ చైర్మన్ మాజీ శాసనసభ్యులు మక్కెన మల్లికార్జునరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

కవి కరీముల్లాకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు

విశాలాంధ్ర - వినుకొండ : వినుకొండకు చెందిన ప్రసిద్ధ కవి కరీముల్లాకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును ప్రభుత్వం అందజేసింది. సెప్టెంబర్ 5న నర్సరావుపేటలో భువన చంద్ర టౌన్ హాల్లో జరిగిన ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు డీఈఓ యల్.చంద్రకళ, జిల్లా పరిషత్ చైర్మన్ హెని క్రిస్టినా, ఎంపీ లావు కృష్ణదేవరాయలు తదితరులు పాల్గొన్నారు. కరీముల్లా ప్రస్తుతం వినుకొండ మండలంలోని నాగులవరం ఆదర్శ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయునిగా పనిచేస్తున్నారు. విద్యాభివృద్ధికి, పాఠశాల అభివృద్ధికి నిరంతరం కృషి చేశారు. విద్యార్థులు, ప్రజల దృష్టిలో ఆదర్శ ఉపాధ్యాయునిగా నిలిచారు.

అవార్డులు అందుకున్నత ఉపాధ్యాయులు

విశాలాంధ్ర-దాచేపల్లి : నగర పంచాయతీ సహా గ్రామీణ మండలంలోని పలు పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఉత్తమ అవార్డులు వరించాయి. వారిలో ఇరికేపల్లి, దాచేపల్లి, తంగెడ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు నాగేంద్ల యేషయ్య, మందా రాజశేఖర్, పావులూరి వాణిశ్రీ ఉన్నారు. ఉత్తమ అవార్డులు అందుకున్న వీరందరినీ తోటి ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.

దేశానికే ఆదర్శం కానున్న ఏపీ క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్: జీవీ

విశాలాంధ్ర - వినుకొండ : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం తీసుకువస్తున్న యూనివర్సల్ హెల్త్ పాలసీ పేదల పాలిట సంజీవని కానుందని చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. డబ్బు లేక చికిత్సలు అందని పరిస్థితుల్లో ఇకపై ఏ ఒక్కరు ప్రాణాలు కోల్పోవాల్సిన పరిస్థితులు ఇకపై ఉండవని, ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రవేశ పెడుతున్న క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్ దేశానికే ఆదర్శం అవుతుందన్నారు. సుమారు 1.63కోట్ల కుటుంబాలు, 5కోట్లమంది ప్రజలకు ప్రయోజనం అందించనున్న అందరికీ ఆరోగ్య బీమా 100శాతం గేమ్ ఛేంజర్ అవుతుందన్నారు. రూ.25 లక్షల వరకు పరిమితి ఉండడం వల్ల ఇకపై ఖరీదైన వైద్య సేవలకు కూడా ఎవరు భయపడాల్సిన పరిస్థితి ఉండదన్నారు. శుక్రవారం ఈ మేరకు ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. చిన్న జ్వరం నుంచి గుండె ఆపరేషన్లు, డయాలసిస్, కేన్సర్ చికిత్సల వరకు నూతన విధానంలో విస్తృత కవరేజీ అందిస్తారని, ఓ కుటుంబానికి అవసరమయ్యే దాదాపు అన్ని రకాల వైద్యలు ఇకపై ఉచితంగా లభిస్తాయని తెలిపారు. రాష్ట్రం మొత్తం దాదాపు 2,493నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో 3,257పైగా వైద్య సేవలు రూపాయి ఖర్చు పెట్టకుండానే అందుతాయన్నారు. ఆస్పత్రు ల్లో చేరిన 6 గంటల్లోనే క్యాష్‌లెస్‌కు అనుమతులు ఇవ్వడంతో జాప్యం లేకుండా సేవల అందుబాటులోకి రానున్నాయని అన్నారు. ఎన్నికలకు ముందు కూటమి తరపున చెప్పినవే కాక కొత్త పథకాలను కూడా ప్రభుత్వం అందిస్తోందనడానికి ఇదే నిదర్శనమని చెప్పారు. ఇన్ని మంచి పనులు చేస్తున్న కూటమి ప్రభుత్వంపై బురదజల్లడమే జగన్, వైసీపీ పనిగా పెట్టుకోవడం దుర్మార్గమని మండిపడ్డారు. ఇకనైనా తీరు మార్చుకోవాలని హితవు పలికారు. రైతుల ముసుగులో యూరియపై వారు చేస్తున్న ఫేక్ ప్రచారాల్ని ఎవరు నమ్మడం లేదన్న జీవీ అవసరాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టిందని, కేంద్రం కూడా సహకరిస్తోందని తెలిపారు.

ఉత్తమ ఉపాధ్యాయునిగా సాంబశివరావు

విశాలాంధ్ర-పెదకూరపాడు : మండల కేంద్రమైన పెదకూరపాడు గ్రామానికి చెందిన రాయపూడి సాంబశివరావు మండల కేంద్రమైన పెదకూరపాడు ఆనందపేటలో జేబీ పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నారు. వివరాల్లోకెళితే ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎన్నిక జరిగిన సాంబశివరావు పలువురు ప్రజాప్రతినిధులు అధికారులు దుశ్శాలువాలతో మెమోంటోలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో నరసరావుపేట శాసనసభ్యులు అరవింద బాబు, రాష్ట్ర నాయి బ్రాహ్మణ ఫెడరేషన్ కమిటీ నెంబర్ మద్దిరాల గంగాధర్ మాట్లాడుతూ సాంబశివరావు చిన్ననాటి నుంచి సేవా కార్యక్రమాలు అందిస్తూ ఉద్యోగరీత్యా క్రమశిక్షణతో కూడిన విద్యను విద్యార్థికి అందించడంలో ఓర్పుతో సహనంతో తనదైన బాణిలో విద్యను బోధించేవారని, అలాంటి సాంబశివరావు మరెన్నో పదవులు అదిరోహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉపాధ్యాయులు మృతి

విశాలాంధ్ర-రొంపిచర్ల : మండల కేంద్రమైన రొంపిచర్లకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయులు దొప్పలపూడి జీవరత్నం(75) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఉపాధ్యాయ దినోత్సవ రోజున తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ నరసరావుపేటలో గల తన స్వగృహంలో కన్నుమూశారు. కాగా మృతునికి భార్య, ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. విషయం తెలుసుకున్న పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ పెద్దలు ఆయన పార్థీవదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన 30 సంవత్సరాలకు పైగా ఉపాధ్యాయులుగా పనిచేసి ఎందరో విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దారని అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవ రోజున మృతిచెందడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన విద్యా రంగానికి చేసిన సేవలు మరువలేనివని పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకొన్నారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

సరిహద్దు కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్, ఎస్పీ

విశాలాంధ్ర-దాచేపల్లి : రాష్ట్రంలో నెలకొన్న యూరియా బస్తాల కొరత నేపథ్యంలో రెండు తెలుగు రాష్ట్రాల సరిహద్దునున్న పొందుగల తనిఖీ కేంద్రాన్ని గురువారం అర్ధరాత్రి జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు, జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు సందర్శించారు. అప్రమత్తంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు. వాహనాలను తనిఖీ చేశారు.

యువతకు ఉచిత శిక్షణ, ఉద్యోగ కల్పన

విశాలాంధ్ర-మాచర్ల : డిపార్ట్మెంట్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి సహకారంతో మాచర్ల ఎస్‌కేబీఆర్ డిగ్రీ కళాశాలలో ఉచిత శిక్షణ, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి జి.తమ్మాజీరావు తెలిపారు. శుక్రవారం తమ్మాజీరావు విలేకరులతో మాట్లాడుతూ ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 12వ తేదీ వరకు దరఖాస్తులు అందచేయాలన్నారు. నియోజకవర్గ పరిధిలోని యువతీ యువకులు, పదవతరగతి పైన చదువుకుని, 15 నుంచి 45 సంవత్సరాల లోపు వయసు గల వారు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిక్షణ కార్యక్రమంలో పాల్గొనదల్చినవారు స్కిల్ హబ్ కో-ఆర్డినేటర్ రమావత్ కిరణ్ నాయక్ సెల్ నెం:7842747682లో సంప్రదించాలని, కోర్స్ కాల వ్యవధి 2 నెలలు ఉంటుందన్నారు. ట్రైనింగ్ పూర్తి అయిన వెంటనే ఉద్యోగ అవకాశాలు కల్పించబడునని తెలిపారు. సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ జె.లక్ష్మి కుమారి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

విశాలాంధ్ర-దాచేపల్లి: ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల్లో శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగానే ముత్యాలంపాడు ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయులను ఆరిజిన్స్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ యరవెద గురవారెడ్డి, సభ్యులు దొండేటి సీతారామిరెడ్డి, పిట్టల రామకోటిరెడ్డి తదితరులు ఘనంగా సన్మానించారు.

గ్రామాల అభివృద్ధే చంద్రబాబు లక్ష్యం: యాగంటి

విశాలాంధ్ర-మాచర్ల : దేశానికి పట్టుకొమ్మలైన గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా సీఎం చంద్రబాబు పాలన సాగుతుందని మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి గ్రామ పంచాయతీల బలోపేతానికి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కొట్లాది రూపాయలను కేటాయించినట్లు ఆయన తెలిపారు. గతేడాది రూ.1452 కోట్లు 15 ఆర్థిక సంఘం నిధులు కేటాయించడం జరిగిందని, అలాగే 2024-2025 సంబంధించి 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1120 కోట్లు గ్రామ పంచాయతీలకు, మండల, జిల్లా పరిషత్‌లకు కేటాయించడం జరిగిందన్నారు. తద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించుటకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు కూడా గ్రామాల అభివృద్ధికే కేటాయిస్తూ నిధులు పక్కదారి పట్టకుండా కూటమి ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టినట్టు ఆయన పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధికి ఒక్క రూపాయి కూడా కేటాయించకుండా కేంద్ర నిధులను కూడా పక్కదారి పట్టించిన ఘనత జగన్‌దేనన్నారు. నాడు జగన్ ఐదేళ్ల పాలనలో అభివృద్ధి శూన్యమన్నారు. నేడు అభివృద్ధి లక్ష్యంగా రాష్ట్రాన్ని పరుగులు పెట్టిస్తున్న సీఎం చంద్రబాబు, తనయుడు నారా లోకేష్‌పై బురదజల్లే మాటలు మాట్లాడటం దుర్మార్గమన్నారు. జగన్ దుష్ప్రచారాలను ప్రజలు నమ్మటం లేదన్నారు. ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి ఆధ్వర్యంలో మాచర్ల నియోజకవర్గం అభివృద్ధితో పరుగులు పెడుతున్నదని అన్నారు. సమావేశంలో నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

muthoot HOUSING FINANCE

ముత్తూట్ హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్

రిజిస్టర్డ్ ఆఫీస్ : టిసి నం.14/2074-7, ముత్తూట్ సెంటర్, పున్నెన్‌రోడ్, తిరువనంతపురం-695 034, సిఐఎన్ నం : యు65922కెఎల్2010పిఎల్‌సి025624 కార్పొరేట్ ఆఫీస్ : 12/ఎ 01, 13వ అంతస్తు, పరిణీ క్రెసెంజో, ప్లాట్ నం.సి38 & సి39, బంద్రా కుర్లా కాంప్లెక్స్-జి బ్లాక్ (ఈస్ట్), ముంబై-400051, టెలి నం : 022-62728517, Email Id: authorised.officer@muthoot.com

అనుబంధం-4 [(నిబంధన 8(1)] స్వాధీనత ప్రకటన (స్థిర ఆస్తి కొరకు)

సెక్యూరిటైజేషన్ అండ్ రికన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ చట్టం, 2002 (54 ఆఫ్ 2002) మరియు సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు- 2002 యొక్క నిబంధన 3 తో చదివే సెక్షన్ 13(12) కింద సంక్రమించిన అధికారాలను వినియోగించి **ముత్తూట్ హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్** యొక్క అధీకృతఅధికారిగా దిగువ సంతకందారు, ఈ కింద ప్రస్తావించిన రుణగ్రహీత(లు) / హామీదారు(లు) లకు డిమాండ్ నోటీసు జారీచేయడమైనది. డిమాండ్ నోటీసు అందుకున్న తేదీ నుంచి 60 రోజుల గడువు పూర్తయిన తర్వాత కూడా రుణగ్రహీత(లు) / హామీదారు(లు) బాకీ మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమైనందున పేర్కొన్న నిబంధనల యొక్క నిబంధన 8 తో చదివే చట్టం లోని సెక్షన్ 13 (4) కింద సంక్రమించిన అధికారాలను వినియోగించి, కింద వివరించిన ఆస్తిని దిగువ సంతకందారు **లాంఛనప్రాయంగా స్వాధీనపరుచుకున్నట్లు** రుణగ్రహీత(లు) / హామీదారు(లు) మరియు సాధారణ ప్రజానీకానికి నోటీసు ఇవ్వడమైనది.

వ. సం.	ఎల్‌ఏఎన్/రుణగ్రహీత/ సహ-రుణగ్రహీత/ హామీదారు పేరు	డిమాండ్ నోటీసు తేదీ	బకాయి పడిన మొత్తం (రూ.లలో) భవిష్యత్తు వడ్డీ వర్తించును	స్వాధీనత తేదీ
1.	లోన్ ఎక్కౌంట్ నెం.11201111541 1. కనపర్తి సునీల్ బాబు 2. కనపర్తి రాజేశ్వరి	04-జూన్ 2025	03-జూన్ -2025 నాటికి రూ.6,02,017.59/-	03-సెప్టెంబరు -2025

హామీగా పెట్టిన ఆస్తి(లు)/స్థిర ఆస్తి(లు) వివరాలు: గుంటూరు జిల్లా, కొల్లిపర ఎస్ఆర్ఓ, కొల్లిపర మండలం, కొల్లిపర గ్రామం, అసెస్‌మెంట్ నం.3364, 3364, డోర్‌నం. 20-130, బ్లాక్ నం.20, డి.నం.799 వద్ద ఆర్‌సిసి పైకప్పు నివాసిత భవనంతో పాటు 309 3/4 చదరపు గజాల భూ విస్తీర్ణపు ఆస్తి మొత్తంగా. హద్దులు: తూర్పు: పుల్లోలు పేతూరు స్థలం, పడమర: పుల్లోలు విజయూరావు ఆస్తి, ఉత్తరం: దొంతిరెడ్డి కోటిరెడ్డి ఆస్తి, దక్షిణం: ఉమ్మడి దారి

ఈ ఆస్తితో ఎటువంటి లావాదేవీలు నెరపరాదని మరియు ఆస్తితో ఎటువంటి లావాదేవీలైనా పైన వివరించినట్లుగా డిమాండ్ చేసిన మొత్తం మరియు దానిపై భవిష్యత్తు వడ్డీకి గాను **ముత్తూట్ హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్** చార్జికి లోబడి ఉండునని ఇందుమూలంగా ప్రత్యేకించి రుణగ్రహీత/లు/హామీదారు/లు మరియు సాధారణ ప్రజలను హెచ్చరించడమైనది.

ప్రదేశం: ఆంధ్రప్రదేశ్, తేదీ: 06 సెప్టెంబరు, 2025 — సం/- అధీకృత అధికారి, ముత్తూట్ హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ తరపున

నైపుణ్యంతోనే ఉద్యోగ అవకాశాలు

అమర్ రాజా జాబ్ మేళాలో ఎమ్మెల్యే కొలికపూడి

విశాలాంధ్ర-తిరువూరు: ఉన్నత విద్య నైపుణ్యంతోనే ఉపాధి అవకాశాలు వస్తాయని తిరువూరు నియోజకవర్గ శాసనసభ్యులు కొలికపూడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీ వాహిని ఇంజనీరింగ్ కళాశాల నందు అమర్ రాజా గ్రోత్ కారిడార్ సంస్థ వారిచే ఏర్పాటు చేసిన మెగా జాబ్ మేళా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన జాబ్ మేళాలో పాల్గొన్న నిరుద్యోగులను ఉద్దేశించి మాట్లాడుతూ ఉన్నత విద్యను అభ్యసించడం ద్వారా మంచి ఉద్యోగాలు రావడమే కాకుండా కుటుంబ ఆర్థిక స్థితిగతులు మారతాయన్నారు. అలానే ఇంత పెద్ద సంస్థ మన తిరువూరు నియోజకవర్గంలో జాబ్ మేళాను నిర్వహించి నిరుద్యోగులకు ఉపాధి కల్పించే విధంగా కృషి చేయడం అభినందనీయమన్నారు. టెన్త్,ఇంటర్, ఐటీఐ తరగతుల నుండి విద్యార్హత కలిగిన వారికి ఉద్యోగ అవకాశాలను వినియోగించుకోవడానికి వచ్చిన ప్రతి ఒక్కరికి ఉద్యోగ అవకాశాలు వచ్చేలా తనవంతు కృషి చేస్తానన్నారు. ఇలాంటి మరెన్నో కంపెనీల ద్వారా నిరుద్యోగుల కలలను సహకారం చేసే దిశగా పనిచేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా శ్రీ వాహిని ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో పాల్గొని సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యేను కళాశాల యాజమాన్యం శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రంగా నాగేంద్రబాబు, ట్రెజరర్ ముత్యాల కిషోర్, ఎండీ షరీఫ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

యూరియా సరఫరాపై
రైతులతో ముఖాముఖి

సంతృప్తి వ్యక్తం చేసిన అన్నదాతలు

విశాలాంధ్ర బ్యూరో- మచిలీపట్నం : జిల్లా కలెక్టర్ డీకే. బాలాజీ పామర్రు మండలం కురుమద్దాలి, కనుమూరు, జుజ్జువరం గ్రామాల్లో యూరియా సరఫరాపై రైతుల అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కంకిపాడు మండలం ఉప్పులూరు గ్రామంలో కలెక్టర్ రైతులతో ముఖాముఖి మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డీకే. బాలాజీ మాట్లాడుతూ ప్రస్తుతం యూరియా అందుతుందని, ఇప్పటికి కొంతమంది రైతులు తమ పొలాలకు రెండు విడతలు యూరియా వేశారన్నారు. కొన్ని చోట్ల మూడో విడత వేసామని తెలిపారు. రైతులకు అవసరమైన యూరియా కొరత లేకుండా చూడాలని ఈ సందర్భంగా అన్నదాతలు కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్ వెంటనే స్పందిస్తూ రైతాంగం ఆందోళన చెందవద్దని, అందరికి యూరియా సరఫరా చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రస్తుతం యూరియా కావలసినంత అందుబాటులో ఉందని, ఇంకా జిల్లాకు అవసరమైన యూరియా నిరంతరం అందుతుందని, పంటపొలాలకు అవసరమైన యూరియాను పంపిణీ చేస్తామని రైతులకు ఎంతో ఓపికగా సమాధానం చెప్పారు. కలెక్టర్ రాక, హామీలతో రైతులు హర్షం వ్యక్తంచేశారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

విశాలాంధ్ర- కూచిపూడి : డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విధి విధానాలను నేటి విద్యార్థిని విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు అనుసరించాలని ఆల్ ఇండియా న్యూస్ పేపర్ ఫెడరేషన్(న్యూఢిల్లీ) ఉపాధ్యక్షులు, సీనియర్ జర్నలిస్ట్ చలాది పూర్ణచంద్రరావు ఆకాంక్షించారు. కూచిపూడి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించే యువజన మాసోత్సవాలలోభాగంగా తొలిరోజైన శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న పూర్ణచంద్రరావు ప్రసంగిస్తూ ఆయన దేశ ప్రథమ పౌరునిగా పనిచేసినా దేశ ప్రజలకు ఒక ఉపాధ్యాయునిగానే గుర్తుండాలని ప్రసంగాలలో ప్రస్తావించేవారని అలాంటి మహనీయుని జయంతి వేడుకలను ఉపాధ్యాయ దినోత్సవంగా నిర్వహించుకోవడం దేశానికే గర్వకారణమని పేర్కొన్నారు. కూచిపూడి రవి ప్రకాష్ సిలికానాంధ్ర సంజీవిని వైద్యాలయంలో నిర్వహించిన ఈ వేడుకలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు జొన్నలగడ్డ హనుమకుమార్, కార్యదర్శి బి. హెచ్. వెంకట రామ శేష సాయి,సన్మానితులైన పెదపూడి జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు పామిరెడ్డి కరుణాకర్‌రెడ్డి, రోటరీ క్లబ్ డైరెక్టర్ బెల్లంకొండ వెంకటేశ్వరరావు, సభ్యులు పాగోలు రమేష్ బాబు, కే రామాంజనేయులు, కోనేరు మంజునాథ్, కోనేరు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు. యూపీ పాఠశాలను జిల్లా పరిషత్ పాఠశాలగా అప్-గ్రేడ్ చేయడానికి కృషి సలిపిన వారిలో ఒకరైన కరుణాకర రెడ్డిని శాలువాతో ప్రశంసా పత్రంతో సత్కరించారు. కార్యక్రమంలో హై స్కూల్ విద్యార్థులతో పాటు సహచర ఉపాధ్యాయులు పలువురు పాల్గొన్నారు.

శివాలయం అభివృద్ధికి కృషి చేస్తా : ఎమ్మెల్యే

విశాలాంధ్ర-కృత్తివెన్ను: శ్రీ దుర్గా పార్వతీ సమేత నాగేశ్వర స్వామి వారి దేవాలయం అభివృద్ధికి కృషిచేస్తానని పెడన శాసన సభ్యులు హామీ ఇచ్చారు. శుక్రవారం శివాలయం వద్ద ట్రస్ట్ బోర్డు సభ్యులు, చైర్మన్ ప్రమాణస్వీకారం కార్య క్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కాగిత మాట్లాడుతూ శివాల యం పరిసరాలను పూర్తిస్థాయిలో అభివృద్ధి పరుస్తానన్నారు. ముఖ్యంగా మహాశివరాత్రి సందర్భంగా వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బం దులు పడకుండా ప్రణాళికబద్ధంగా దేవాలయం పరిసరాలను అభివృద్ధి పరచవలసిన అవసరం ఉందన్నారు. శివాలయం ట్రస్ట్ బోర్డు చైర్మన్ గా చేకూరి వెంకటరావు, సభ్యులుగా దాసరి శ్రీనివాస రావు, బాడిత నాగబాబు, మోకా దుర్గ భవానితో పాటు మరికొంతమంది సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్ర మంలో ఆలయ మేనేజర్ సింగనపల్లి శ్రీనివాస రావు, ఏఎంసి చైర్మన్ ఒడుగు తులసిరావు, మండల టిడిపి ప్రధాన కార్యదర్శి పిన్నింటి రత్తయ్య, డీసీ చైర్మన్ నెక్కంటి విజయభాస్కర రావు, వైస్ చైర్మన్ బొర్రా ఏడుకొండలు, బస్వాని బంగార్రాజు, సూరగాని బ్రహ్మం, నాగిడి చెన్నకేశవరావు తో పాటు జనసేన, టిడిపి, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా టీచర్స్ డే వేడుకలు

విశాలాంధ్ర-తిరువూరు: శ్రీ వాహిని కాలేజీలో శుక్రవారం సంతోష్ ఆటో మోటార్స్ ప్రైవేట్ లిమిటెడ్, లక్ష్మీపురం, తిరువూరు ఆధ్వర్యంలో టీచర్స్ డే కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రంగా నాగేంద్రబాబు, కోశాధికారి ముత్యాల కిషోర్‌బాబు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో సంతోష్ ఆటో మోటార్స్ ప్రతినిధులు శివాజీ, చెన్నరావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు నిరంతర జ్ఞానప్రదాతలు : కొమ్మారెడ్డి కిషోర్

విశాలాంధ్ర-బంటుమిల్లి: భావిభారత పౌరులను తయారు చేసే నిత్యశ్రామికులు, నిరంతర జ్ఞానప్రదాతలు ఉపాధ్యా యులేనని కొమ్మారెడ్డి టాలెంట్ హైస్కూల్ డైరెక్టర్ కొమ్మారెడ్డి కిషోర్ అన్నారు. స్థానిక కొమ్మారెడ్డి టాలెంట్ హైస్కూల్ ఆవరణలో శుక్రవారం ఉపాధ్యాయుడు, మాజీ రాష్ట్రపతి, దివంగత డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించు కుని ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ వేడుకల్లో ముందుగా పాఠశాల డైరెక్టర్ కొమ్మారెడ్డి కిషోర్ రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగ కిషోర్ మాట్లాడుతూ డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ గారి జీవితం ఆదర్శప్రాయమని, రాధా కృష్ణన్ జీవిత విశేషాలను, గొప్పదనాన్ని తెలియ జేశారు. భావిభారత పౌరులను తయారుచేసే నిత్యశ్రామికులు, నిరంతర జ్ఞానప్రదాతలు ఉపాధ్యాయులన్నారు. మనదేశం అన్ని రంగాలలో అభివృద్ధి చెందడానికి కావలసిన అత్యుత్తమ విద్యను అందించడంలో ఉపాధ్యాయుల పాత్ర ముఖ్యమైన దన్నారు. తమ పాఠశాలలోనే చదువుకుని ఇక్కడే ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న కొందరిని సన్మానించుకోవడం ఎంతో గర్వంగా ఉందని పేర్కొన్నారు. తదనంతరం ఉపాధ్యాయులకు వివిధ క్రీడా పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ కొమ్మారెడ్డి కిషోర్,స్కూల్ సెక్రెటరీ మరియు కరెస్పాండెంట్ కె.యస్.వి.జి.శోభ,కొమ్మారెడ్డి చైతన్య,కొమ్మారెడ్డి హరిణి,ఎన్.శ్రీనివాసరావు, ఉపాధ్యాయిని,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘంటసాలలో వైభవంగా
గణనాధుని గ్రామోత్సవం

- రూ.27 వేల లడ్డూ కైవసం చేసుకున్న వెంకటరామయ్య

విశాలాంధ్ర - ఘంటసాల : ఘంటసాల గ్రామంలోని శ్రీ జలధీశ్వర స్వామి ఆలయం ముందు ముస్లిం సోదరుడు అక్బర్ బాషా (షామియాన) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాయ చవితి నవరాత్రుల ఉత్సవాలు ముగిశాయి. లడ్డూ వేలం పాట నిర్వహించగా గ్రామానికి చెందిన తాపీమేస్త్రీ వెంకటరామయ్య రూ.27 వేలకు కైవసం చేసుకున్నారు. అర్చకులు చావలి కృష్ణ కిషోర్ ఆధ్వర్యంలో స్వామి వార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. ట్రాక్టర్‌పై గణనాధుని నిలబెట్టి తీన్మార్ వాయిద్యాలు, డీజేతో గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. శ్రీకాకుళం గ్రామంలోని కృష్ణానదిలో గణనాధుని నిమజ్జనం చేశారు. 9రోజుల పాటు పరిసరాలను పరిశుభ్రం చేసిన 10 పంచాయతీ పారిశుద్ధ్యం కార్మికులకు బాషా నూతన వస్త్రాలను అందించారు. శ్రీకాకుళం డీసీ చైర్మన్ అయిన పూడి భాను ప్రకాష్, పీఏసీఎస్ చైర్మన్ బండి పరాత్పరరావు, వేమూరి రమేష్, అరవింద్, జొన్నలగడ్డ హరీష్, సోలే శ్రీను, ఆటో బాబూరావు, రవితేజ, ధర్మారావు, కమిటీ సభ్యులు, గ్రామస్తులు, పాల్గొన్నారు.

ముసాఫిర్ ఖానా కోశాధికారిగా ఖాదర్

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): విజయవాడ వన్ టౌన్ పంజా సెంటర్ సమీపంలోని షా జహూర్ ముసా ఫిర్ ఖానా కోశాధికారిగా సయ్యద్ ఖాదర్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు టీడీపీ 53వ డివిజన్ అధ్యక్షుడు మహ్మద్ జాహిద్, మరికొందరు నాయకులు, ముస్లిం మైనారిటీ పెద్దలు అభినందనలు తెలిపారు. తనపై నమ్మకంతో ప్రతిష్ఠాత్మకమైన ముసాఫిర్ ఖానా కోశాధికారిగా నియమించిన వక్ఫ్ బోర్డుకు, సహక రించిన టీడీపీ ముఖ్య నాయకులకు ఖాదర్ ధన్యవాదాలు తెలిపారు.

10న అరవింద్ నిరాహార దీక్ష

విశాలాంధ్ర-విస్సన్నపేటటౌన్: విస్సన్న పేటకు చెందిన అధికారపార్టీ తెలుగు దేశంకు చెందిన మాచిన అరవింద్ తాను ఈనెల 10వ తేదీ నుంచి నిరా హారదీక్ష చేపట్టనున్నట్లు ప్రకటించారు. విస్సన్నపేట పంచాయతీలోని ఒకటి, రెండు వార్డుల్లో ఏళ్ల తరబడి అభివృద్ధికి నోచుకోని రహదారులు, మురుగుకాలువల సమస్య పరిష్కారం కోసం ఈ దీక్ష చేపట్టనున్నామన్నారు. 10వ తేదీలోగా సమస్య పరిష్కారమై అధికారులు, ప్రజాప్రతినిధుల నుంచి స్పష్టత ఇవ్వాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. గతంలో పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య కనీసం పట్టించుకున్న దాఖలాలు లేకపోవటంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

గురువులకు సన్మానం

విశాలాంధ్ర-చల్లపల్లి : గురుపూజోత్సవం సందర్భంగా చల్లపల్లి రాజా కళాశాల పూర్వవిద్యార్థులు తమకు విద్యా బుద్ధులు నేర్పించటంతోపాటు సేవాభావాన్ని పెంపొంది చిన విశ్రాంత ప్రిన్సిపాల్ టి.సాంబశివరావును సన్మాని ంచారు. స్థానిక చంద్ర రాజేశ్వరావు వికాసకేంద్రంలో శుక్రవారం సాయంత్రం జరిగిన ఈ కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు ఉరిమి, మణి కాంత్, మోటుపల్లి రత్న కుమారి, అడ్డాడ ప్రసాద్ బాబు, ఉప్పల నాంచా రయ్య, రావి రాజశేఖర్, నడకుదురు లీలాబ్రహ్మేంద్ర, చేతన్, జిలానీ, సిద్ధాబత్తుల వాసు తదితరులు పాల్గొని సాంబ శివరావును దుశ్శాలువాతో సత్కరించగా, రత్నకుమారి నూతన వస్త్రాలు అందించారు. పూర్వవిద్యార్థుల అసోసి యేషన్ స్థాపించిన మాస్టారు శిష్యులతో కలిసి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్ బాబు అన్నారు. ఈ సందర్భంగా ప్రసాద్‌బాబుతో కలిసి సాంబశివరావు కేక్ కట్‌చేశారు. సేవాకార్యక్రమాలకు సహకారం అంది స్తున్న ప్రసాద్‌బాబును ఈ సందర్భంగా పూర్వవిద్యార్థులు సన్మానించారు.

మత సామరస్యంతో మెలగాలి

- మిలాద్ ఉన్ నబీ ర్యాలీలో కేశినేని చిన్ని

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): ప్రజలు మత సామరస్యంతో మెలగాలని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) అన్నారు. శుక్రవారం విజయవాడ పంజాసెంటర్‌లో ఈద్ మిలాద్ ఉన్ నబీ కమిటీ ఆధ్వర్యంలో పంజా సెంటర్ నుంచి కాళేశ్వరరావు మార్కెట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీ కేశినేని చిన్ని హాజరైయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్త ప్రపంచానికి శాంతి, సౌభ్రాతృత్వాలను సోదరభావాన్ని బోధించారని, ప్రపంచ మానవాళి శ్రేయస్సు కోసం ప్రార్థించాలని సూచించారు. మహమ్మద్ ప్రవక్త జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకుని సన్మార్గంలో నడుస్తూ వారి బోధనలు సార్థకం చేయాలని కోరారు. సర్వమతాల సారాంశం ఒక్కటేనని, సమాజంలో హిందూ ముస్లిం భాయ్ భాయ్‌గా జీవనం కొనసాగిస్తూ మతసామరస్యంతో ముందుకు సాగాలన్నారు. అనంతరం వించిపేట గాంధీబొమ్మ సెంటర్ నుంచి మిలాద్ జులూస్(ర్యాలీ) చేపట్టారు. మహంతిపురం ఖాదర్ సెంటర్ వైపు నుంచి పంజాసెంటర్, బాబూరాజేంద్ర ప్రసాద్ రోడ్డు మీదుగా కాళేశ్వరరావు మార్కెట్‌లోని జుమ్మ మసీదుకు చేరుకున్నారు. అర్గనైజింగ్ కమిటీ సెక్రటరీ ఎండీ.యూనీస్, కమిటీ సభ్యులు, మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, టీడీపీ నాయకులు ఎం.ఎస్ బేగ్, ఫతావుల్లా వేలాది సంఖ్యలో ముస్లీం సోదరులు పాల్గొన్నారు.

రాష్ట్ర చేనేత సహకార సంఘాల యాత్రను జయప్రదం చేయండి

విశాలాంధ్ర-పెడన : చేనేత కార్మికుల సమస్యలపై కృష్ణా జిల్లాలో రెండు రోజులు పాటు జరిగే చేనేత సహకార సంఘాల అధ్యయన యాత్రను జయ ప్రదం చేయాలని కృష్ణాజిల్లా చేనేత కార్మిక సంఘం అధ్యక్షులు కోదాడ నారాయణరావు, కార్యదర్శి బూసం బాలసుబ్రమణ్యం కార్మికులకు పిలుపు నిచ్చారు. ఈనెల 11వ తేదీన పెడన పట్టణంలోని సర్వోదయ చేనేత సహకార సంఘంలో చేనేత అధ్యయన యాత్రను రాష్ట్ర చేనేత కార్మిక సంఘం, భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో ఉదయం 11 గంటలకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అధ్య యన యాత్రను ప్రారంభిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్య దర్శి అడ్డాడ ప్రసాద్ మాట్లాడుతూ 11వ తేదీ ఉదయం పెడన, మధ్యాహ్నం కప్పలదొడ్డి గ్రామం, 12వ తేదీ ఉదయం 9 గంటలకు గూడూరు మండలం పోలవరం, ఐదుగుళ్లపల్లి, 11:30 నిమిషాలకు మల్లో వోలు, 12 గంటలకు రాయవరం, ఒంటిగంటకు కాజా, ఘంటసాల, నాలుగు గంటలకు చల్లపల్లి గ్రామంలో చేనేత అధ్యయన యాత్ర ముగుస్తుందని తెలిపారు. ఈ అధ్య యన యాత్ర రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో పర్యటించి ఒక నివేదిక తయారుచేసి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి కార్మికుల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తుందని తెలిపారు. చేనేత కార్మికుల సమస్యల పరిష్కారం కాకపోతే భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమాలకు సిద్ధమవుతామని ప్రసాద్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు పేరిశెట్టి ఉమాకాంతరావు, రాష్ట్ర చేనేత కార్మిక సంఘం మాజీ అధ్యక్షులు కట్టా హేమసుందర్ రావు, యక్కల. పీతాంబరధరరావు, వాసు, పేరిశెట్టి విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలి

విశాలాంధ్ర -కంచికచర్ల: జర్నలిస్టుల తోడ్పాటుకు విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని), స్థానిక శాసన సభ్యురాలు ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్యల సహకారంతో జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కోగంటిబాబు కంచికచర్ల ప్రెస్ క్లబ్ సభ్యులకు హామీ ఇచ్చారు. శుక్రవారం కంచికచర్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఇటీవల చైర్మన్‌గా పదవీ బాధ్య తలు చేపట్టిన కోగంటి వెంకట సత్యనారాయణను కంచికచర్ల ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు గంగిరెడ్డి రంగారావు మాస్టారు ఆధ్వర్యంలో కంచికచర్ల ప్రెస్‌క్లబ్ సభ్యులు ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు గంగిరెడ్డి రంగారావు జర్నలిస్టుల సమస్యలపై ఆయన మాట్లాడుతూ విజయ వాడ పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే సౌమ్య ద్వారా సంబంధిత శాఖ మంత్రి కొలుసు పార్థసారథి దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలు భారీగా హామీలు ఇస్తున్నారే తప్ప ఆచరణలో సాధ్యం కావడం లేదని ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు గంగిరెడ్డి రంగారావు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు మారుతున్నా జర్నలిస్టు సమస్యలు మాత్రం ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా మారిందన్నారు. కూటమి ప్రభుత్వంలో నైనా జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ పెద్దలతో సంప్రదించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని బాబును గంగిరెడ్డి కోరారు. ఇటీవలే కంచికచర్ల సహకార సంఘం చైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన గుత్తా వీర వెంకటరత్నంను కూడా ప్రెస్ క్లబ్ సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కంచికచర్ల ప్రెస్ క్లబ్ సభ్యులు నన్నపనేని వెంకట దుర్గారావు, చాపా సత్యనారాయణ, గంపా మాధవరావు, బచ్చు వెంకటేశ్వరరావు, లంకోజి నాగమల్లేశ్వరరావు, పగడాల రాధా కృష్ణ, తోట క్రాంతి, మట్టిపల్లి బాలకృష్ణ, కొండవీటి రాధా కృష్ణ, కందిమళ్ళ భవాని, బొక్కా రవికుమార్, సుమన్ దేవ్, జల్లా హనుమంతురావు, బొక్కా నాగేశ్వరరావు, కట్టాతిరుపతిరావు, బొక్కా శ్రీకాంత్, అనుముల రంగారావు, గోపి పాల్గొన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ

విశాలాంధ్ర-కూచిపూడి: మిలాద్ ఉన్ నబి పర్వదినం శుక్రవారంతో కలిసి రావడంతో మరింత ప్రత్యేక సంతరించుకుంది. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్ద షౌకత్ అలీ (పెదపూడి) పర్యవేక్షణలో కూచిపూడిలోని రవి ప్రకాష్ సిలికానాంధ్ర సంజీవిని వైద్యాలయంలో చిన్నారి బాలికలు తమ కుటుంబ సభ్యుల సహకారంతో 70 మందికి పైగా రోగులకు, వైద్యాలయ సిబ్బందికి పండ్లు పంపిణీ చేశారు.

భక్తిశ్రద్ధలతో మిలాద్ ఉన్ నబి

చల్లపల్లిలో ఇస్లాం పతాకంతో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లిం సోదరులు

విశాలాంధ్ర - చల్లపల్లి : ముస్లింల ఆరాధ్య దైవం మహమ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా మిలాద్ నబి పర్వదినాన్ని చల్లపల్లిలో ముస్లిం సోదరులు శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఇస్లాం పతాకంతో ముస్లిం సోదరులు ఉదయం చల్లపల్లి పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. చల్లపల్లి మసీదుల్లో ప్రత్యేక ప్రార్ధనలు జరిపారు. ఖురాన్ గురువులు మిలాద్ నబి విశిష్టతను, ప్రవక్త బోధనలను వివరించారు. ఈ కార్యక్రమంలో పెద్దమసీదు కమిటీ అధ్యక్షుడు షేక్ నసీం ఘోరి, అహ్మద్ జానీ, మీర్ రిజ్వాన్, అబ్దుల్ అర్షద్, మహ్మద్ హుస్సేన్, సుభానీ, అబ్దుల్ రహీమ్, ముస్లిం సోదరులు తదితరులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, **NANDAMURI SUDHIR BABU (Old name) son of Paparao** 56 hindu resident of D.No. 3-114, PEDDA AVUTAPALLI, Unguturu Mandal, Krishna District, (ap aadhar no 2607 1408 3062) I have CHANGED my name as **NANDAMURI SUDHEER BABU (New Name) son of Paparao** hereinafter my name is known as **NANDAMURI SUDHEER BABU (New Name) son of Paparao**

CHANGE OF NAME

I VEJJU PAVANI, W/o.Vejju Achyuth Kumar, aged 50 years, R/o.Door No.32-8-6, Flat No.405, HRT Upasana Apartments, Giripuram,, Vijayawada-520010 do hereby solemnly affirm and declare as under That my husband has changed his name as VEJJU ACHUTA KUMAR to VEJJU ACHYUTH KUMAR as per records of my husband certificates/Aadhaar card/Passport herein after my husband Name is **VEJJU ACHYUTH KUMAR**

CHANGE OF NAME

I, Swargam Ganapati (Old Name), S/o. Swargam Venkata Swamy, residing at # 10-14, Padmasali Street, Panja Centre, Kondapalli, Ibrahimpatnam, NTR District, A.P. - 521228, I have changed my name to **Swargam Ganapathi Rao** (New Name) Hence forth I will be known as **SWARGAM GANAPATHI RAO**

CHANGE OF SURNAME

I KAMINENI VIJAYA KUMARI (Old Name) W/o Valluripalli Satyanarayana, Hindu, Residing at Flat No. 304, Fortune Avenue, BMPS Road, H.No. 10-256, Near Sachivalayam, Prasadampadu, Vijayawada rural Malda, NTR District. I have changed my surname as **VALLURIPALLI VIJAYA KUMARI (New surname) W/o. Valluripalli Satyanarayana,** hereafter my name is known as **VALLURIPALLI VIJAYA KUMARI (New Name) W/o. Valluripalli Satyanarayana,** for all purposes.

SBFC **ఎస్‌బిఎఫ్‌సి ఫైనాన్స్ లిమిటెడ్**

రిజిష్టర్డ్ ఆఫీస్ : యూనిట్‌నం: 103, 1వ అంతస్తు, సి&బి స్క్వేర్, సంగం కాంప్లెక్స్, సిటిఎస్ నం.95ఎ, 127, అంధేరి కుర్లా రోడ్, చాకాల గ్రామం, అంధేరి(ఇ),ముంబై-400059 (టెలిఫోన్ : +91 22 67875300), ఫ్యాక్స్: +91 22 67875334 (WWW.SBFC.COM) కార్పొరేట్‌గుర్తింపుసంఖ్య:యు67190ఎంహెచ్2008పిటిసి178270

బహిరంగ ప్రకటన

దిగువ పేర్కొన్న బ్రాంచ్ చిరునామా వద్ద తాకట్టు పెట్టబడిన బంగారు ఆభరణాలు ఎస్‌బీఎఫ్‌సీ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా **తేదీ: 23 సెప్టెంబరు, 2025- ఉదయం 10.30** గంటలకు కింది బ్రాంచ్ చిరునామాలో వేలం వేయబడునని ఇందుమూలంగా యావన్మంది ప్రజానీకానికి తెలియజేయడమైనది. వేలం వేయబడు బంగారు ఆభరణాలు, బకాయిలు చెల్లించుటలో విఫలమైన మా యొక్క వేర్వేరు ఖాతాదారుల లోన్ ఎకౌంట్లకు చెందినవి. ఈ రుణగ్రహీతలకు మా నుంచి వేలం నోటీసులు సక్రమంగా జారీ చేయబడినవి. వేలానికి పెట్టిన బంగారు ఆభరణాలు...ఈ కింద పేర్కొన్న బ్రాంచి వివరాలతో పాటు వేర్వేరు ఖాతాదారుల కస్టమర్ ఐడీతో అనుసంధానమై ఉన్న అన్ని ఎకౌంట్లకు చెందినవి.

ఒంగోలు బ్రాంచ్ చిరునామా: ఎస్‌బీఎఫ్‌సీ ఫైనాన్స్ లిమిటెడ్, ఎఆర్ఎన్ కాంప్లెక్స్, రెండవ అంతస్తు, కమర్షియల్ బిల్డింగ్ నెం: **37-1-169,** రెండవ కర్నూలు రోడ్డు, సరోజ్ మయూరి థియేటర్ పక్కన, కేబి రెసిడెన్సీ ఎదుట, ఒంగోలు, ఏపీ-**523002.** AP00323373,AP00471425,AP00521835, Ap00528680, AP00529929, AP00533260, AP00556907, AP00557065, AP00604900, AP00606858, AP00616111, AP00626935, AP00631890, AP00637017, AP00637460, AP00638899, AP00639125, AP00639570, AP00656586, AP00656630, AP00657671, AP00663726, AP00664658, AP00665541, AP00666082, AP00666908, AP00671803, AP00674784, AP00683302, AP00685264, AP00693293, AP00693351

రాజమండ్రి బ్రాంచ్ చిరునామా: ఎస్‌బీఎఫ్‌సీ ఫైనాన్స్ లిమిటెడ్, డి.నం.**6-3-1, 1**వ అంతస్తు, చల్లపల్లివారి వీధి, టి-నగర్, రాజమండ్రి అర్బన్, తూర్పుగోదావరి, ఆంధ్రప్రదేశ్-**533101** AP00267261,AP00362362,AP00494951,AP00521356,AP00657099,AP00683382

ఏలూరు బ్రాంచ్ చిరునామా: ఎస్‌బీఎఫ్‌సీ ఫైనాన్స్ లిమిటెడ్, డోర్ నం. **23బి-593/1,** సావిత్రి కాంప్లెక్స్, **1**వ అంతస్తు, ఈదరవారి వీధి, ఏక్సిస్ బ్యాంక్ పక్కన, ఆర్.ఆర్.పేట్, ఏలూరు (ఆంధ్రప్రదేశ్) AP00319167, AP00646878, AP00650827, AP00670927, AP00673850, AP00683424, AP00723973

రాజాం బ్రాంచ్ చిరునామా: ఎస్‌బీఎఫ్‌సీ ఫైనాన్స్ లిమిటెడ్,డోర్ నెం.**15-4-41,** చీపురుపల్లి రోడ్డు, రెవిన్యూ వార్డ్ నం.**8,** రాజాం,ఆంధ్రప్రదేశ్-**532127** , Ap00688987

విజయవాడ బ్రాంచ్ చిరునామా: ఎస్‌బీఎఫ్‌సీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, చంద్రాలోక్ కాంప్లెక్స్, బిల్డింగ్ నం:**59/ఎ,10/1/5,** కె.పి.నగర్,విజయవాడ-**520008.** Ap00684424

భీమవరం బ్రాంచ్ చిరునామా: ఎస్‌బీఎఫ్‌సీ ఫైనాన్స్ లిమిటెడ్, **22-10-18/3, 1**వ అంతస్తు, తటవర్తివారి వీధి, ఐడిబిఐ బ్యాంక్ ఎదుట, పశ్చిమగోదావరి జిల్లా, భీమవరం-**534 201,** AP00569654

మరిన్ని వివరాల కొరకు, దయచేసి ఎస్‌బీఎఫ్‌సీ ఫైనాన్స్ లిమిటెడ్ యొక్క సంప్రదించు సంఖ్య(లు) : 18001028012 నందు సంప్రదించగలరు. (వేలం వేయబడు ఖాతాల సంఖ్యలు మార్చుటకు & ఎటువంటి ముందస్తు నోటీసు లేకుండానే వేలాన్ని వాయిదా/రద్దు చేయుటకు ఎస్‌బీఎఫ్‌సీ ఫైనాన్స్ లిమిటెడ్ కలిగియున్నది.

యూరియా కొరత

నివారించకుంటే ఆందోళన

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: రైతులకు యూరియా కొరతను నివారించకుంటే రాష్ట్రవ్యాప్తంగా సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన తప్పదని మండల పార్టీ కార్యదర్శి ఎం.త్యాగరాజు హెచ్చరించారు. విస్సన్నపేట గ్రోమోర్ కేంద్రానికి యూరియా చేరిందన్న సమాచారంతో గురువారం అర్ధరాత్రి సమయానికే పెద్దఎత్తున రైతులు చేరుకున్నారు. శుక్రవారం ఉదయానికి వీరి సంఖ్య మరింత పెరగటంతో పోలీసులు అక్కడికి చేరి, ముందుజాగ్రత్త చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా త్యాగరాజు మాట్లాడుతూ, రైతుల సాగు అవసరాల విషయంలో ప్రభుత్వం ముందు జాగ్రత్తలు పాటించకపోవటమే ఈ సమస్యకు కారణమన్నారు. ఇప్పటికైనా త్వరితగతిన సమస్య పరిష్కారం చేయకుంటే ఈనెల 8వ తేదీన అన్ని మండల కేంద్రాల్లో సీపీఐ ఆందోళన చేపట్టనుందని పేర్కొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులుగా

అమ్మన్నబాబు, అప్పారావులు

విశాలాంధ్ర-గుడివాడ : స్థానిక ఏజికే మున్సిపల్ హైస్కూల్‌లో శుక్రవారం జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకోబోతున్న ఏ.జి. కె షటిల్ కోర్టు సభ్యులు ఎం.అమ్మన్న బాబు, టి.అప్పారావులను షటిల్‌కోర్డు సభ్యులు సత్కారించారు. ఈ కార్యక్రమంలో ఈడే వెంకటేశ్వరరావు, ఈడే శ్రీనివాసరావు, కె.ఎల్. శ్రీనాథ్, కె.చంద్రశేఖరరావు, వి.మురళీ, కె.సతీష్, ఎండి హుస్సేన్‌పాషా, ఈ.రాజేష్, పాండు, పవన్, గోపాల్, శివశ్రీ, నాగరాజు, హరిబాబు, దాశరథి, శివనాగమల్లేశ్వరావు, తదితరలు పాల్గొన్నారు.

రోడ్డుపై పశువులు ప్రయాణం ఎలా సారూ...!?

విశాలాంధ్ర- విస్సన్నపేట టౌన్: విస్సన్నపేటలో నిత్యం రద్ధీగా ఉండే సెంటర్లు గాంధీబొమ్మ సెంటర్, అంబేడ్కర్ సెంటర్. ఈ రెండు సెంటర్లలో గత కొంతకాలంగా పెద్దఎత్తున పశువుల సంచారం పెరగటంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా ఆయా సెంటర్లలో పదుల సంఖ్యలో పశువులు సంచరిస్తుండటంతో రాకపోకలకు తీవ్ర సమస్యలు ఎదురవుతున్నాయి. కొన్ని సందర్భాల్లో రహదారులపై ఇవి తిష్ట వేసి, వాహనాలకు దారి ఇవ్వకపోవటంతో రాకపోకలు నిలిచిపోతున్న సంఘటనలు కూడా ఉన్నాయి. ఈ విషయమై గతంలో పలుమార్లు పంచాయతీ అధికారులు మైక్ ద్వారా ప్రచారం చేసినా, సత్ఫలితాలు రాలేదని, అధికారులు పశువుల సంచారంపై చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఆటో కార్మికులు ఆకలి కేకలు పట్టించుకోని ప్రభుత్వం

- ప్రమాణాలు ఉల్లంఘించి ఆటో కార్మికుల పొట్ట కొడుతున్న రాపిడ్, ఓలా, ఉబర్ బైక్ సర్వీస్‌లు

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : ఆటో కార్మికుల ఆకలి కేకలు పట్టించుకోని కూటమి ప్రభుత్వం, ఎన్నికల హామీలో భాగంగా ఆటో డ్రైవర్లకి రూ. 15వేలు ఇవ్వాలని, ఓలా, ఉబర్, రాపిడ్ సర్వీస్ రద్దు చేయా లని కూటమి ప్రభుత్వాన్ని ఎం. రామకృష్ణ డిమాండ్ చేశారు. ఇఫ్టూ అనుబంధ సంఘం ప్రగతిశీల ఆటో కార్మిక సంఘం ఆధ్వర్యంలో విజయవాడ ధర్నా చౌక్‌లో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఆటో రంగంపై ఆధారపడి జీవి స్తున్న కార్మికులు రోడ్డున పడ్డారని విమర్శించారు.రాపిడ్, ఓలా, ఉబర్ బైక్ సర్వీస్‌లు ఎటువంటి ప్రమాణాలు పాటిం చడం కూడా సర్వీస్ కంపెనీలు తమ ఆదాయం పెంచు కుంటూ ఆటోవాలా పొట్ట కొడుతున్నప్పటికి ప్రభుత్వ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల ముందు ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని, రూ.15 వేలు ఆర్థిక సాయం అందిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి 14 నెలలు అవుతున్నా ఆటోరంగంపై సమీక్ష చేయకపోవడం దుర దృష్టకరమన్నారు. అధిక పెనాల్టీ లు వేసే జీవో 21ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మహిళలకు ఫ్రీ బస్సు ఇస్తున్న రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ ద్వారా ఇంధనం, సిఎన్ జి గ్యాస్ ఆటో కార్మికులకు అందించాలని కూటమి ప్రభుత్వాన్ని కోరారు.ఆటో కార్మికులు సమస్యలపై ఈ నెల 18 ఛలో విజయవాడ కార్యక్రమంలో ఆటో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ఆటో కార్మికులకు ఆయన పిలుపు నిచ్చారు.ఈ కార్యక్రమంలో ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు కె.వి. రమణ, నగర అధ్యక్షుడు రవీంద్ర, ప్రగతిశీల ఆటో కార్మిక సంఘం నగర కార్యదర్శి ఆర్. కనక రావు, నాని, అర్జున్, సత్యనారాయణ, రామచంద్ర రావు, పెద్దిరాజు, వెంకటేష్, జి.కోటేశ్వరరావు, అరుణోదయ శ్రీను, లెనిన్, మీరావలి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఫెన్సింగ్ పోటీలకు ధరణి ఎంపిక

విశాలాంధ్ర-వీరులపాడు: మండలంలోని ఏకత్వ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని కిలారు ధరణి శ్రీ జాతీయస్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ఫౌండర్, డైరెక్టర్ అమరనేని మనోజ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ధరిణిశ్రీని ఏకత్వ పాఠశాల చైర్మన్ అమరనేని రమేష్ బాబు పుష్పగుచ్ఛ మిచ్చి శాలువ కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రమేష్ బాబు మాట్లాడుతూ జాతీయస్థాయి ఫెన్సింగ్ పోటీలలో కూడా ఉత్తమ ప్రతిభ కనబరిచి విజేతగా రావాలని అయన అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చైతన్య కళాశాల ప్రిన్సిపల్ అమరనేని కార్తీక్, జ్యోతి, ఫిజికల్ డైరెక్టర్ గోగులమూడి విజయ్ కుమార్, విద్యార్థిని తల్లిదండ్రులు కిలారు వంశీకృష్ణ, పూజిత పాల్గొన్నారు.

నామమాత్రంగా సర్వసభ్య సమావేశం

- సభ ప్రారంభించగానే వెళ్లిపోయిన మండల పరిషత్తు సభ్యులు

విశాలాంధ్ర- విస్సన్నపేట : విస్సన్నపేటలో గురువారం జరిగిన మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం ఆరంభంలోనే అయిపోయినట్లే నంటూ సభ్యులు వెనుదిరిగారు. అయితే అప్పటికే హాజరు పట్టీలో సంతకాలు చేయటంతో కోరం పూర్తయిందంటూ అధికారులు సహచర శాఖల అధికారులతో సభను కొనసాగించారు. విస్సన్నపేట మండలపరిషత్తు సర్వసభ్య సమావేశం ఎంపీపీ పిల్లి మెర్సీ వనజాక్షి అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సమావేశానికి పలువురు సభ్యులు, పీఏసీఎస్ అధ్యక్షులు, సర్పంచులు హాజరయ్యారు. వీరందరిచే ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది హాజరు పట్టీలో సంతకాలు చేయించగా, సంతకాలు పూర్తి అవుతుండగానే ఎంపీడీవో సిహెచ్.చిన్నరాట్నాలు సభకు కోరం పూర్తయినందున ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. వెంటనే హాజరైన సభ్యులంతా సభ నుంచి ఒక్కసారిగా లేచి వెళ్లిపోయారు. వారు ఎందుకు ఇలా వెళుతున్నారనే విషయమై కారణాలు తెలియరాలేదు. మండలపరిషత్తు కోఆప్షన్ సభ్యుడు షేక్ జాఫర్‌బాబా సభ ఆరంభానికి ముందే స్థానిక గాంధీబొమ్మ సెంటర్‌లో ప్రధాన రహదారి ఆక్రమణకు గురైందని, ఆక్రమణల తొలగింపులో అధికారులు అలసత్వం వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేయగా, ఎంపీడీవో సమస్యను ఎన్‌హెచ్‌ఏఐ సంస్థ దృష్టికి తీసుకెళ్లి, సమస్య పరిష్కరించనున్నట్లు హామీ ఇచ్చారు. సభ ఆరంభం అనంతరం కేవలం వివిధ శాఖల అధికారులు తమశాఖల పురోగతిని వివరించటంతో సరిపెట్టారు. సమావేశంలో తహశీల్దారు కె.లక్ష్మీకల్యాణి, ఏవో ప్రసాద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ నిరుపేదలకు సాయం చేయాలి

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : మిలాద్-ఉన్-నబీ పండుగ వేళ ప్రతి ఒక్కరూ తమకు ఉన్నంతలో నిరుపేదలకు సాయపడాలని నవరంగ్ కాంగ్రెస్ ఆర్టీ అధ్యక్షులు షేక్ జలీల్ సూచించారు. శుక్రవారం గాంధీ నగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో మిలాద్-ఉన్-నబీ పండుగ సందర్భ ంగా కేక్ కటింగ్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విజయవాడ నగరంలో గాలిబ్ షాహిద్ దర్గా భూములు సర్వే నెం:600, 63, 10 లలో ఖాళీగా ఉన్న భూములను నిరుపేద ముస్లింలకు ఇల్లు కట్టుకోవటం కోసం ప్రభుత్వం అనుమతి ఇవ్వాలి అని డిమాండ్ చేశారు.విద్య,ఉద్యోగ రంగాలలో ముస్లింలకు (షేక్, సయ్యద్, పఠాన్, మొగల్) 12% రిజర్వేషన్ కల్పించాలన్నారు.ముస్లిం మహిళలకు పెళ్ళికి దుల్హన్ పథకం క్రింద రూ.ఒక లక్ష కేటాయించాలి.మస్జిద్ లో ప్రార్థన చేసే ఇమామ్,మౌజన్ లకు సొంత ఇల్లు మంజూరు చేసే విధంగా ప్రభుత్వం జివో విడుదల చేయాలన్నారు.ముస్లింలలో ఉన్న వితంతువు,వయో వృద్ధులకు పెన్షన్,సొంత ఇల్లు నిర్మాణం కొరకు హౌసింగ్ లోను కేటాయించాలి.అమరావతి రాజధానిలో జుమ్మ మసీద్ నిర్మాణం కొరకు 100 ఎకరాలు స్థలం కేటాయించి వెయ్యి కోట్లు నిధులను విడుదల చేసి,దాని బాధ్యతలు ముస్లిం ఐక్యవేదిక అంజుమన్ ఇస్లామిక్ కమిటి వారికి అప్పగించాలన్నారు.ఉర్దూ అకాడమీ ద్వారా పేద విద్యార్థులకు స్కాలర్ షిప్ ఇవ్వాలి.రాష్ట్రంలో అమరా వతి హజ్ హౌస్ నిర్మాణం చేప్పటి దానికి 500 కోట్ల రూపాయిలు నిధులు కేటాయించాలి.మైనారిటీ కార్పొరేషన్ లో ముస్లింలకు లోన్లు ఇవ్వాలి.జాతీయ రహదారులపై ముస్లింలకు నమాజ్ కొరకు మస్జిద్ నిర్మాణములు చేప్పట్టాలన్నారు.ముస్లిం కార్పొరేషన్ ఏర్పాటు చేసి వెయ్యి కోట్ల రూపాయిలు బడ్జెట్ లో కేటాయించాలి.వక్ఫ్ బోర్డు భూములలో అన్యమతస్థులను ఖాళీ చేసి ముస్లిం లకు ఇచ్చేవిధంగా ప్రభుత్వం జివో విడుదల చేయాలన్నారు.ఈ సమావేశంలో పప్పుల సాంబశివరావు,గుర్రం రామారావు,షేక్ మస్తాన్ వలీ,సయ్యద్ సైదా,తదితరులు పాల్గొన్నారు.

పాశం శేషమ్మకు నివాళి

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : కృష్ణలంక చల సాని నగర్ 18వ డివిజన్ శాఖ కోశాధికారి పాశం ఆంజనే యులు మాతృమూర్తి పాశం శేషమ్మ గురువారం రాత్రి 9 గం.లకు అనా రోగ్యంతో కోటినగర్‌లోని తమ నివాసం వద్ద మృతి చెందారు. మృతివార్త తెలిసిన వెంటనే సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దొనేపూడి శంకర్, సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌రావు, సీపీఐ నగర సహాయ కార్యదర్శి లంక దుర్గారావు, సీపీఐ నగర కార్యదర్శి వర్గ సభ్యులు, 17, 18 డివిజన్‌ల ఇన్‌ఛార్జ్ సంగుల పేరయ్య ఏఐటీయూసీ నగర నాయకులు మూలి సాంబయ్య, ఆర్‌కే ఆంజనేయులు, ఏఐవైఎఫ్ నగర నాయకులు లంక గోవింద రాజులు జూనియర్, బెవర శ్రీను, 18వ డివిజన్ కార్యదర్శి అంబడిపూడి మోహన్ కుమార్, డివిజన్ సహాయ కార్యదర్శి కూరాకుల స్టాలిన్, బ్రాంచి కమిటీ సభ్యులు నడింపల్లి అచ్చిబాబు, దారా దాసు, దారా రమేష్, ఉస్తేల రాహేలు బాబు, పార్టీ సభ్యులు పాశం శేషమ్మ మృతదేహాన్ని సందర్శించి ఘనమైన నివాళులర్పించి పాశం ఆంజనేయులకు వారి కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

సీఎం చంద్రబాబుతోనే అమరావతి అభివృద్ధి

- ప్రముఖ సినీనటులు మురళీమోహన్

విశాలాంధ్ర-విజయవాడ: రాష్ట్రానికి ఒకే రాజధాని ఉండాలని, అమరావతి రాజధాని కూటమి ప్రభుత్వం ప్రపంచ నగరాలకు పోటీగా తీర్చి దిద్దుతోందని ప్రముఖ సినీనటులు మురళీమోహన్ పేర్కొన్నారు. గత ప్రభుత్వం మూడు రాజధానుల పేరుతో అమరావతి అభివృద్ధిని అడ్డుకుందని ఆయన విమర్శించారు. భూమి మీద పెట్టుబడి పెట్టిన వారెవరు నష్టపోరని అన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చాక రియల్ ఎస్టేట్ వ్యాపారానికి మంచి రోజులు వచ్చాయని ఆయన అభిప్రాయపడ్డారు. విజయవాడ గురునానక్ కాలనీ లో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీకర స్పేసెస్ అండ్ స్ట్రక్చర్ కార్యాలయాన్ని జయభేరి కన్స్ట్రక్షన్ అధినేత,నటులు, నిర్మాత మురళీ మోహన్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారంలో తనకంటూ ఒక ప్రత్యేకతను సంతరించుకున్న శ్రీకర సంస్థ విజయవాడలో కార్యాలయం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. బుల్లితెర యాంకర్ వర్ష మాట్లాడుతూ తన తల్లితండ్రుల మాట వినకుండా విలాస వస్తువులకు తాను ఖర్చు చేశానని, అదే సమయంలో తన కుటుంబ సభ్యులు భూమిపై పెట్టుబడులు పెట్టారని ప్రస్తుతం అది రెండింతలై మంచి లాభాలు వచ్చాయని అన్నారు. శ్రీకర లాంటి సంస్థలు పెట్టుబడులు పెట్టాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్,కార్పొరేటర్ దేవినేని అపర్ణ, సంస్థ సి ఈ వో వై. శ్రీనివాసరావు,కార్యాలయ ఇంచార్జ్ అరుణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

గురుపూజోత్సవంలో జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి వాసంశెట్టి సుభాష్, సర్వేపల్లి రాధాకృష్ణన్‌ను ఘన నివాళులర్పించిన నగర ప్రముఖులు

విశాలాంధ్ర బ్యూరో- మచిలీపట్నం : స్థానిక జడ్పీ కన్వెన్షన్ హాలులో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గురుపూజోత్సవ కార్యక్రమంలో జిల్లా ఇన్చార్జ్ మంత్రి వాసంశెట్టి సుభాష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో తొలుత వందేమాతర గీతంతో మొదలు కాగా ఇన్చార్జ్ మంత్రి వాసంశెట్టి సుభాష్, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు, రాష్ట్ర గౌడ సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి, జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ చైర్మన్ బండి రామకృష్ణ, జిల్లా జాయింట్ కలెక్టర్ గీతాంజలీ శర్మ, జిల్లా ఎస్పీ ఆర్. గంగాధర రావు కలిసి పూర్వపు రాష్ట్రపతి సర్వేపల్ల రాధాకృష్ణన్ విగ్రహ మూర్తికి పూల మాలలు వేసి పుష్పాలతో అలంకరించి ఘనంగా నివాళులర్పించారు. మంత్రి జ్యోతిప్రజ్వలన చేసి కార్య క్రమాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లా డుతూ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ పుట్టినరోజును వ్యక్తిగతంగా తనకోసం కాకుండా ఉపాధ్యాయ దినోత్సవం పేరుతో ఉపాధ్యాయులందరికీ గౌరవదక్కేలా నిర్వహించడం అభినందనీయ మన్నారు. 1994 సంవత్సరంలో యునెస్కో అక్టోబర్ 5వ తేదీన ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం గా ప్రకటించిందని, అయితే సెప్టెంబర్ 5వ తేదీన దేశంలో డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి రోజున ఉపాధ్యాయ దినోత్సవం జరుపుకుంటున్నందుకు సంతోషంగా ఉందన్నారు. ప్రతి మనిషి జీవితంలో ఒక గురువు ఉంటారని, ఒక్కో దశలో వారు ఒక్కో ప్రభావం చూపుతుంటారన్నారు. తనజీవితంలో గణపతి మాస్టారు ప్రభావితం చేశారని, తనలో నాయకత్వ లక్షణాలు ఉన్నాయని, సేవ చేసే గుణం ఉందని, కోపం కాస్త తగ్గించు కుని బిఎల్ పూర్తి చేయాలని, బంగారు భవిష్యత్తు ఉంటుందని మార్గ నిర్దేశం చేశారన్నారు. ఆయన ఆశీస్సుల వలన ఈ స్థాయికి చేరుకున్నానని, వారిని ఎల్లప్పుడు గుర్తు పెట్టుకుంటానన్నారు. ప్రపంచంలో ఉపాధ్యాయ వృత్తి కంటే గొప్ప వృత్తి మరొకటి లేదని ప్రశంసించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 14 సంవత్సరాల పాలనలో 13 డీఎస్సీలను నిర్వహించారని, సుమారు 1,80,208 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేశారని దీని ద్వారా విద్యావ్యవస్థ పట్ల ఉన్న గౌరవానికి ఇదే నిదర్శనమన్నారు. విద్యార్థుల ప్రతిబను గుర్తించి షైనింగ్ స్టార్స్ పేరుతో జిల్లాలో 161 మంది విద్యార్థులకు 20 వేల రూపాయల చొప్పున ప్రోత్సాహక బహుమతులు ఇచ్చారని, గత ప్రభుత్వం 6 రకాల బల్ల విధానం పెట్టి ఉపాధ్యాయులపై ఉన్న ఒత్తిడిని తగ్గించడానికి తమ ప్రభుత్వం 9 రకాల బండ్ల విధానం తెచ్చి సులభతరం చేసిందన్నారు. ప్రతిపక్షం 24 కేసులు పెట్టినా లెక్కచేయక ముఖ్యమంత్రి తాము ఇచ్చిన హామీ మేరకు మెగా డీఎస్సీ నిర్వహించి 16,347 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తోందని, నియామక ఉత్తర్వులు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా మాట్లాడుతూ విద్యార్థులకు విజ్ఞానం అందించి మంచి ప్రయోజకులుగా సమాజంలో ఉన్నత స్థాయికి చేరుకునేందుకు ఉపాధ్యాయులు ఎంతగానో తోడ్పడతారని, వారు ఎన్ని బాధల్లో ఉన్నా లేక ఎన్ని కష్టాల్లో ఉన్నా అన్నింటిని దిగ˘మింగుకొని బాధ్యతగా విద్యారు&థలకు మంచి చదువు చెబుతారని ఉదాహరణకు తన జీవితంలో ఎదురైన సంఘటనలు గుర్తు చేసుకున్నారు.

రాష్ట్ర ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ ˘నారాయణరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు ఎవరూ సాటి రారని,విద్యార్థి దశలో విద్యావంతులను చేసి మంచి ప్రయోజకులుగా తీర్చిదిద్దేది గురువులేనన్నారు. తల్లిదండ్రులతో పాటు గురువులు కూడా పూజింప బడుతున్నారని, అందుకే గురుబ్రహ్మ, గురువిష్ణు గురుదేవో మహేశ్వర అంటూ గురువులకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. తల్లిదండ్రులతో పాటు గురువులు కూడా దైవంతో సమానం అన్నారు. డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ కూడా అధ్యాపకులేనని తర్వాత ఆయన రాజకీయాల్లో చేరి రాష్ట్రపతి స్థాయికి ఎదిగారన్నారు.

రాష్ట్ర గౌడ సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి మాట్లాడుతూ అక్షర రూపంలో ఉన్న ఒక సిరా చుక్క లక్ష మంది మెదడులకు పదును పెడుతుందని మహాకవి కాళోజీ చెప్పినట్లు అక్షరాలను మాలలుగా చేసి విద్యార్థుల మెడలోవేసి బిడ్డల బంగారు భవిష్యత్తు తీర్చిదిద్దే గొప్ప వ్యక్తులు ఉపాధ్యాయులని, సమాజ సేవ చేయడానికి ఒక ఐఏఎస్, ఐపిఎస్, రాజకీయ నాయకులే కాకుండా ప్రతి ఒక్కరికి విద్యాబుద్ధులు నేర్పి ప్రయోజకులుగా తయారు చేసే దేవుళ్లు ఉపాధ్యాయులన్నారు.

డీఈఓ పివిజె. రామారావు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ డీకె. బాలాజీ చొరవతో నాకు సాధ్యమే అనే ఒక 60 మంది ఉన్నత స్థానంలోని వారి జీవిత చరిత్రలు పిల్లలకు ప్రతిరోజు వినిపించమని ఒక ప్రత్యేక పుస్తకాన్ని సిద్ధం చేశానని, పిల్లలందరికీ ప్రార్థన సమయంలో వారికి ఒక ఇన్సిరేషన్ స్టోరీస్ చెప్పడంతో పాఠశాల ప్రారంభమవుతుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన స్వాగతనృత్యం, సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి.

ప్రీమియంపై జీఎస్టీ రద్దు చారిత్రాత్మక విజయం

విశాలాంధ్ర-మచిలీపట్నం : వ్యక్తిగత జీవితబీమా, ఆరోగ్యబీమా పాలసీలపై 18శాతంగా ఉన్న జి.ఎస్.టీ.ని రద్దు చేస్తూ ఈ నెల 3 వతేదీన జరిగిన 56వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశం తీసుకున్న నిర్ణయాన్ని ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ స్వాగతిస్తుందని ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి జి. కిశోర్ కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక ఎల్ఐసి కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇన్సూరెన్సు ప్రీమియంపై జి.ఎస్.టీ.ని రద్దు చేయాలని డిమాండు చేస్తూ గత దశాబ్దకాలంగా ఆలిండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసో సియేషన్ (ఎ.ఐ.ఐ.ఇ.ఎ) చేసిన పోరాటం విజయం సాధించిందన్నారు. ఇన్సూరెన్సు ప్రీమి యంపై జి.ఎస్.టీ.ని ఉపసంహ రించు కోవలసిందిగా కోరారు. 11.07. 2024న లోక్ సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ కూడా జి.ఎస్.టీ. విషయాన్ని ప్రస్తావించి, రద్దు చేయాలని కోరారు.

తాగునీటి సరఫరాలో జాగ్రత్తలు తీసుకోండి

నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : వర్షాకాలం నేపథ్యంలో తాగునీటి సరఫరాలో జాగ్రత్తలు అవసరమని నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. త్రాగునీటి సరఫరాపై కమిషనర్ శుక్రవారం వివిధ శాఖాధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో త్రాగునీటిలో ఎలాంటి లోపం ఉండరాదని, శుద్ధమైన త్రాగునీటిని సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని, ఎప్పటికప్పుడు త్రాగునీటి పరీక్షలు చేస్తుండాలని ఏమైనా తేడాలు గమనించిన వెంటనే ఆ సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాల న్నారు. కొండ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజ లకు త్రాగునీటి సరఫరాలో ఎటువంటి లో పం, అంతరాయం ఉండరాదని, ప్రతి ఒక్క రికి త్రాగునీటి సరఫరా చేసేలా చూడా లన్నారు. డ్రెయిన్లలో త్రాగునీటి పైపుల క్రాసింగ్‌లను తొలగించినప్పటికీ ఇంకా ఏమైనా ఉంటే అధికారులు పరి శీలించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

టూరిజం రంగాల్లో

విస్తృత ఉపాధి అవకాశాలు

కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

విశాలాంధ్ర-విజయవాడ: కృష్ణా జిల్లాలోని ఆత్కూరు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రాన్ని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ శు క్రవారం సందర్శించారు. ఈ కేంద్రంలో 15 మంది అభ్యర్థులకు ఇస్తున్న ట్రావెల్ అండ్ టూరిస్ట్ గైడ్ శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ శిక్షణ కార్యక్రమం ఆగస్టు 28న ప్రారంభం కాగా ఈ నెల 6వ తేదీ శనివారంతో ముగియనుంది. జిల్లా లీడ్ బ్యాంక్ యూనియన్ బ్యాంక్ సహకారంతో ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతోంది. జిల్లాను టూరిజం హబ్ గా తీర్చి దిద్దడానికి చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా ఔత్సాహికులకు టూరిజం, ట్రావెల్ గైడ్ అంశాల్లో శిక్షణ కార్య క్రమాన్ని నిర్వహించడం జరుగు తోందని కలెక్టర్ డా. జి. లక్ష్మీశ అన్నారు. జిల్లాలో పర్యాటక, సాంస్కృతిక, చారిత్రక, ఆధ్యాత్మిక ప్రదేశాలను పర్యాటకులు సందర్శించేలా ప్రత్యేక టూర్ ప్యాకేజీలు అందుబాటులోకి తేవడా నికి ఇప్పటికే చర్యలు తీసుకు న్నా మన్నారు.నవ్య రాజధాని అమరా వతికి ముఖ ద్వారమైన విజయవాడ, జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పర్యాటక రంగా అభివృద్ధికి మంచి అవకాశాలు ఉన్నాయన్నారు. ఏ రంగంలోనైనా కెరీర్ పరంగా ఎదగాలంటే తగిన నైపుణ్యాలు పెంపొందించుకోవాలని పేర్కొన్నా రు. గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రం డైరెక్టర్ వి.అమరేశ్వర్ రెడ్డి, జిల్లా పర్యాటక అధికారి ఎ.శిల్ప, ఎర్త్ హీరోస్ ఫౌండేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్ గోపీచంద్, జిల్లా విద్యాధికారి రామారావు, విద్యాశాఖ డిప్యూటీ డీఈఓలు శేఖర్ సింగ్, పద్మారాణి, రవికుమార్, ఏడీలు రవుష్, విద్యా లత, జిల్లా సైన్స్ అధికారి మహ్మద్ జాకీర్ అహ్మద్, ఎంఈఓలు, ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

సరికొత్త విక్టోరిస్‌ను మారుతి సుజుకీ విడుదల

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): భారతదేశపు ఎస్యువీ విభాగాన్ని పునర్నిర్వచిస్తూ మారుతి సుజుకీ ఇండియా లిమిటెడ్ కొత్త ఎస్యువీ విక్టోరిస్ ను విడుదల చేసింది. హైపర్-కనక్టెడ్ టెక్నాలజీ, సంపూర్ణమైన భద్రత, అధునాతనమైన, నాజూకైన డిజైన్‌తో, అన్నీ కలిగి ఉన్న ఎస్యువీ అందచేసే ఉల్లాసకరమైన పెర్ఫార్మెన్స్‌తో విక్టోరిస్ నిరంతరంగా కలిసిపోతుంది, స్ట్రాంగ్ హైబ్రిడ్, ఆల్ గ్రిప్ సెలెక్ట్, పర్యావరణానుకూలమైన ఎస్-సీఎన్జీ టెక్నాలజీతో పెట్రోలులో లభిస్తోంది. శ్రేణిలోనే మొదటి అండర్ బాడీ డిజైన్‌తో, విక్టోరిస్ నేటి చురుకైన యువతకి అనుకూలమైన విస్తృత శ్రేణి పవర్‌ట్రైన్ వ్యవస్థల్ని అందిస్తోంది. కస్టమర్లు తమ సరికొత్త విక్టోరిస్‌ను రూ. 11,000కి బుక్ చేయవచ్చు.

చల్లా కిషోర్‌రెడ్డికి జాతీయ ఉత్తమ టీచర్ అవార్డు

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): విజయ వాడ రూరల్ నున్న వికాస్ వికాస్ గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ ప్రొఫెసర్ డాక్టర్. చల్లా కిశోర్ రెడ్డి జాతీయ స్థాయి మెంటార్ టీచర్ అవార్డు అందుకున్నారని వికాస్ గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూ షన్స్ కార్యదర్శి ఎన్. సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బెస్ట్ మెంటార్ ఫర్ స్టూడెంట్స్ సక్సెస్ కేటగిరీలో మొత్తం 206 అభ్య ర్థనలు రాగా, ఈ క్యాటగిరీలో డాక్టర్ చల్ల కిషోర్‌రెడ్డి అవార్డుకు ఎంపిక య్యారు. జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా నిర్వహించే వేడుకల్లో ఈ ప్రతిష్టాత్మక అవార్డును సీ-డ్యాక్ అసోసియేషన్ డైరెక్టర్, సైంటిస్ట్ డాక్టర్ ఎం.కుమార్, జేఎన్టీయూ విజయనగరం వైస్ ఛాన్సలర్ డాక్టర్ డి.రాజ్య లక్ష్మీ అవార్డు ప్రదానం చేశారు. ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్స్ కోఆర్డినేట ర్‌గా ఎనిమి దేళ్లు ఏపీఎస్‌ఎస్‌డీసీ స్కిల్, బ్యూరో ఆఫ్ ఇండియా స్టాండర్డ్స్ క్లబ్ కోఆర్డినేటర్ వంటి పలు ముఖ్య బాధ్యతలు నిర్వహిస్తూ, అనేక సాంకేతిక అవగాహన కార్యక్రమాలను ఇంజనీరింగ్ విద్యార్థుల కోసం నిర్వహించారు. ఇంజనీరింగ్ పిహెచ్‌డీతో పాటు సైకాలజీలో ఎం.ఏ పట్టా పొంది, స్టూడెంట్ కౌన్సెలింగ్ సెంటర్ (ఎస్‌సీసీ) కోఆర్డినేటర్‌గా అనేక మంది విద్యార్థుల సమస్య లకు సలహాలు, మార్గదర్శకత్వం అందించారు. ఈ సంవత్సరం సీఎస్‌సీ ఇండియా సహకారంతో 120 మందికి పైగా ఎస్సీఎస్టీ విద్యార్థులకు రూ. 24 వేలు విలువ చేసే నైలిట్ నైపుణ్యాభివృద్ధి కోర్సుల్లో ఉచితంగా నమోదు చేయిం చారు. అలాగే సేవా భారతి, విజ్ఞాన భారతి, ఆర్‌ఎస్‌ఎస్ వంటి అనేక సామా జిక, శాస్త్రీయ సంస్థల్లో చురుకైన సభ్యునిగా సేవలందిస్తున్నారు. గత నాలుగే ళ్లుగా భారతీయ విజ్ఞాన మండలి ఆధ్వర్యంలో నిర్వహించే కౌశల్, అవిష్కార్ రాష్ట్ర స్థాయి కార్యక్రమాలకు రాష్ట్ర కోఆర్డినేటర్ కీలక పాత్ర పోషించారు. వికాస్ గ్రూప్ ఇన్స్టిట్యూషన్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ పీఎస్.శ్రీనివాస్, వివిధ విభాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు డాక్టర్ కిషోర్‌రెడ్డిని అభినందిస్తూ భవిష్యత్తులో మరెన్నో జాతీయ, అంతర్జాతీయ అవార్డులు అందుకోవాలని శుభాకాంక్షలు తెలిపారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

విశాలాంధ్ర - చల్లపల్లి : చల్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని నిమ్మగడ్డలో కృష్ణానది పాయలో శుక్రవారం గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. నదిలో కొట్టుకువచ్చిన మృతదేహం నిమ్మగడ్డ వద్ద ఎత్తిపోతల పథకం సమీపానికి చేరటంతో స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. బ్లూ కలర్ ప్యాంటు, బిస్కట్ రంగు చారల చొక్కా కలిగిఉన్న పురుషుని మృతదేహం వయసు 45 - 50 ఏళ్ల లోపు ఉండవచ్చని అంచనావేస్తున్నారు. గుర్తుపట్టేందుకు వీల్లేనివిధంగా ముఖం, శరీరం పూర్తిగా పాడైపోయింది. మరణించి రెండు వారాలకుపైగా అయి ఉంటుందని భావిస్తున్నారు. వీఆర్వో పెనుమూడి వెంకటేశ్వరరావు శవపంచనామా నిర్వహించగా, చల్లపల్లి ఎస్‌ఐ పివిస్వి.సుబ్రహ్మణ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అవనిగడ్డ ప్రభుత్వాసుపత్రి వైద్యులు సంఘటనా ప్రదేశానికి వచ్చి మృతదేహానికి శవపరీక్ష నిర్వహించగా అనంతరం ఖననం చేశారు.

వాసవి క్లబ్ జోన్ 3 సేవలు అభినందనీయం



విశాలాంధ్ర-గంపలగూడెం: గ్రామీణ ప్రాంతాల్లో వాసవి క్లబ్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు చేపడుతూ ప్రజల మన్ననలు పొందుతున్నామని వాసవి క్లబ్ అంతర్జాతీయ నాయకులు చెన్నగిరి. శ్రీనివాసరావు అన్నారు.శుక్రవారం మండలంలోని ఊటుకూరు గ్రామంలో కోట శ్రీనివాసరావు, నాగమణిల ప్రాంతీయ సమావేశం అట్టహాసంగా జరిగింది.ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన వాసవి క్లబ్ జోన్ 3 పరిధిలోని గ్రామాల్లో చేసిన సేవా కార్యక్రమాలు చూసి అభినందనీయం అని ప్రశంసించారు. కార్యక్రమంలో రీజియన్ అధ్యక్షుడు పల్లపోతు .చక్రవర్తి,,రీజియన్ కార్యదర్శి కుక్కడపు. సతీష్,వాసవి క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు పద్మనాభుని. సర్వేశ్వరరావు,వనితలు కోట. నాగమణి,వేముల. పద్మ,సముద్రాల. రాజ్యలక్ష్మి,తదితరులు పాల్గొన్నారు.

గోద్రేజ్ జెర్సీతో ఈ పోషకాహార వారంలో పనీర్ సామర్థ్యాన్ని తెలుసుకోండి

విశాలాంధ్ర -విజయవాడ (వన్ టౌన్): భారతదేశంలో శాఖాహార ఆహారంలో ప్రొటీన్ కు సంబంధించి అత్యంత కీలకమైన మూలంగా, పనీర్ ఎల్లప్పుడూ నిలుస్తుంది. సమతుల్య పోషకాహారాన్ని నిర్ధారించడంలో ఇది అతి ముఖ్యమైన పాత్రను పోషిస్తుంది. మాంసాహారులు అనేక రకాల ప్రొటీన్ అవకాశాలను ఆస్వాదిస్తున్నప్పటికీ, శాఖాహారులకు, పనీర్ అత్యంత ఆరోగ్యకరమైన,ప్రభావవంతమైన ఎంపికగా ఉంది. ఇది రోజువారీ భోజనంలో భర్తీ చేయలేని ఆహారంగానూ నిలుస్తుంది. శాఖాహారంలో పనీర్ పాత్ర గురించి గోద్రేజ్ జెర్సీ మార్కెటింగ్ హెడ్ శంతను రాజ్ మాట్లాడుతూ, "పనీర్ కేవలం ప్యాక్ చేయబడిన ఆహార పదార్థం కాదు, సమతుల్య ఆహారంలో తప్పనిసరిగా ఉండవలసిన పదార్థం. సహజ ప్రొటీన్ పొందేందుకు చక్కటి మూలం. ఒక పనీర్ ప్యాక్‌లో దాదాపు ఆరు గుడ్ల విలువైన ప్రొటీన్ లభిస్తుంది. ఈ న్యూట్రిషన్ వీక్‌లో, పనీర్‌ను కేవలం ఒక పదార్థం కంటే ఎక్కువగా గోద్రేజ్ జెర్సీ వేడుక జరుపుకుంటోంది" అని పేర్కొన్నారు.

బిగ్ బాస్ తెలుగు భాగస్వామిగా హైయర్ ఇండియా

విశాలాంధ్ర-విజయవాడ: వరుసగా 16 సంవత్సరాలుగా ప్రపంచ నెం.1 మేజర్ అప్లయెన్సెస్ బ్రాండ్‌గా నిలిచిన హైయర్ అప్లయెన్సెస్ ఇండియా, ఈ ఏడాది కూడా ప్రేక్షకుల ముందు వెలుగులోకి వస్తోందని హైయర్ అప్లయెన్సెస్ ఇండియా అధ్యక్షుడు ఎన్ఎస్ సతీష్ తెలిపారు. స్టార్ మా ఎస్ డీ & హెచ్ డీలో మరియు జియోహాట్‌స్టార్‌లో ప్రసారమవుతున్న బిగ్ బాస్ తెలుగు సీజన్ 9 కు అసోసియేట్ స్పాన్సర్‌గా హైయర్ మరోసారి ముందుకొచ్చిందన్నారు. దక్షిణ భారతదేశంలో అత్యంత ఆదరణ పొందిన ఈ రియాలిటీ షోతో భాగస్వామ్యం ద్వారా, తెలుగుభాషా ప్రేక్షకులతో తమ అనుబంధాన్ని మరింత బలోపేతం చేయాలనే హైయర్ సంకల్పాన్ని ఇది ప్రతిబింబిస్తోందని చెప్పారు. ఈ భాగస్వామ్యంతో హైయర్ ఎల్ ఈ డి టీవీలు, ఫ్రిజ్‌లు మరియు ఎయిర్ కండీషనర్లు బిగ్ బాస్ ఇంటి లోపల ప్రతిష్టాత్మకంగా ప్రదర్శించబడతాయన్నారు. మోర్ క్రియేషన్ మోర్ పాజిబిలిటీస్ అనే తత్వాన్ని ప్రతిబింబిస్తూ, షోలోని సహజమైన సమీకరణాల ద్వారా హైయర్ యొక్క ఆధునిక ఏ ఐ సాంకేతికత, సృజనాత్మకత, ప్రీమియం డిజైన్‌లను నేరుగా ప్రేక్షకుల గృహాలకి చేరువ చేస్తుందన్నారు. ఇకపోతే, హైయర్ తన వాషింగ్ మెషీన్‌లను కేంద్రీకరించి ప్రత్యేకంగా రూపొందించిన ఇన్ హౌస్ టాస్క్ ద్వారా ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందించనుందని, ఈ యాక్టివేషన్ ద్వారా హైయర్ యొక్క అత్యాధునిక లాండ్రీ టెక్నాలజీని చూపించడమే కాకుండా, ప్రతిరోజు పనులను మరింత సులభం, స్మార్ట్‌గా మార్చే బ్రాండ్ నిబద్ధతను కూడా హైలైట్ చేస్తుందన్నారు. ఇలా వినోదభరితమైన, గుర్తుండిపోయే క్షణాలను సృష్టించడం ద్వారా, హైయర్ ప్రేక్షకులతో పాటు పోటీదారులతోనూ భావోద్వేగ అనుబంధాన్ని మరింతగా పెంచుకోవాలని లక్ష్యంగా పెట్టుకుందని చెప్పారు. "బిగ్ బాస్ తెలుగుతో మా గత భాగస్వామ్యం అద్భుత విజయాన్ని సాధించిందని, వరుసగా ఇది ఆరోసారి భాగస్వామ్యం అని చెప్పారు.

తమ భూమిని రక్షించి న్యాయం చేయండి

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : కొంతమంది తమ భూమిని కబ్జాదారుల కోరల్లో ఉన్నదని వారి నుండి తప్పించి తమకు న్యాయం చేయాలని తిరుపతి జిల్లా వరదయ్యపాలెం మండల స్థానిక నివాసి వి.శేషప్రియ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.శుక్రవారం గాంధీనగర్ ప్రెస్ క్లబ్‌లో విలేఖరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ వరదయ్యపాలెం మండలం చిన్న పాండూరు గ్రామంలో తన తాత చెరుకుమూడి అయ్య శంకరయ్య ద్వారా సంక్రమించిన 16 ఎకరాల సాగు భూమిని కొందరు కబ్జా రాయుళ్లు భూకబ్జా చేశారని ఆరోపించారు. దీనిపై కోర్టును ఆశ్రయించగా హైకోర్టు తమను హక్కుదారులుగా ప్రకటించిందన్నారు. హైకోర్టు తీర్పు అనుసరించి తాత చెరుకుమూడి అయ్య శంకరయ్య పేరు మీద ఉన్న పొలం పట్టాలను తమ పేరున మార్చాలని తహశీల్దార్ కు అర్జీ సమర్పించామని తెలిపారు. కబ్జాదారుల పేర్లు వెకెట్ చేసి ఆర్డీవో అనుమతికి పంపించారన్నారు. ఇప్పటికి ఆరు నెలలు గడుస్తున్నా ఆర్డీవో నుంచి అనుమతి రాలేదని, తహశీల్దార్ ను కలవాలని చెప్పారన్నారు. అక్కడకు వెళ్లితే ఆర్డీవో నుంచి అనుమతి లేకుండా ఏమీ చేయలేమని తహశీల్దార్ చెబుతున్నారని ఈ విధంగా అధికారుల చుట్టూ ఆరు నెలలుగా తిరుగుతున్న స్పందన కరువైందని అవేదన వ్యక్తం చేశారు ఇప్పటికైన తమ సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ల దృష్టికి వెళ్ళితే అధికారులు స్పందించి కబ్జాదారుల నుంచి తమ భూమి విడిపించి తమకు న్యాయం చేస్తారనే ఆశతో ఉన్నామని తక్షణం ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలని కోరారు.

విజయవాడ ప్రీమియర్ లీగ్ టీ-20 క్వాలిఫైయర్ టోర్నమెంట్ ఎంట్రీ రిజిస్ట్రేషన్ పొడిగింపు

విశాలాంధ్ర - విజయవాడ స్పోర్ట్స్ : ఎంపీ కేశినేని శివనాథ్ ఆధ్వర్యంలో కేశినేని ఫౌండేషన్ ద్వారా నిర్వహించే విజయవాడ ప్రీమియర్ లీగ్ కు క్రికెట్ ప్లేయర్ ఎంపిక కోసం క్వాలిఫైయర్ టోర్నమెంట్ ఎంట్రీ రిజిస్ట్రేషన్ కి గడువు తేదీ సెప్టెంబర్ 30వ తేదీ వరకు పొడిగించటం జరిగింది. ఈ మేరకు ఎంపీ కేశినేని శివనాథ్ కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్టీఆర్ జిల్లాలోని క్రికెట్ ప్లేయర్స్ అభ్యర్థన మేరకు ఎంట్రీ రిజిస్ట్రేషన్ గడువు పొడిగించటం జరిగిందన్నారు. ఈ టోర్నమెంట్ లో ఆడాలనుకునే క్రికెట్ క్రీడాకారులు వారి టీమ్ వివరాలను సెప్టెంబర్ 30వ తేదీ లోపు అందించాలన్నారు. గురునానక్ కాలనీలోని కేశినేని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం, ఎన్టీఆర్ భవన్ నందు టీమ్ పేర్లు ఇతర వివరాలు నమోదు చేయించుకోవాలన్నారు. 16 సంవత్సరాల నుంచి 35 సంవత్సరాల మధ్య వున్న వారు మాత్రమే ఈ టోర్నమెంట్ లో పాల్గొనటానికి అర్హతగా నిర్ణయించారన్నారు. ఈ టోర్నమెంట్ లో పాల్గొనే క్రికెట్ ప్లేయర్స్ ఆధార్ కార్డ్, డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్‌తో పాటు పాస్ పోర్ట్ సైజ్ ఫోటో సమర్పించాలన్నారు. విజయవాడ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు, విజయవాడ రూరల్ మండలం, పెనమలూరు మండలానికి వారు ఈ పోటీల్లో పాల్గొనవచ్చున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

విశాలాంధ్ర- పెదపారుపూడి : నేటి(శనివారం) ఉదయం 8 గంటల నుండి 1:00 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుచున్నదని విద్యుత్ శాఖ గుడివాడ డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో శుక్రవారం అన్నారు. యలమర్రు ఫీడర్ పరిధిలోని గ్రామాలలో విద్యుత్ వైర్లు దగ్గరగా ఉన్న చెట్లను తొలగించేందుకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు పెదపారుపూడి ఏఈ వర కుమార్ వివరించారు.

కేఎల్‌యూలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ప్రారంభం

విశాలాంధ్ర-విజయవాడ: కేఎల్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ ఇటీవల తన క్యాంపస్‌లో జునిపర్ ఏఐ-డ్రివెన్ క్యాంపస్ - సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ప్రారంభించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ ఛాన్సలర్ కోనేరు సత్యనారాయణ మాట్లాడుతూ డిజిటల్ పరివర్తనలో ఒక మార్గదర్శక అడుగు వేసింది. ఏఐ-డ్రివెన్ నెట్‌వర్కింగ్‌లో ప్రపంచ నాయకుడైన జునిపర్ నెట్‌వర్క్స్ సహకారంతో స్థాపించబడిన ఈ కేంద్రం, ఇండియా విద్యా వ్యవస్థలోకి తీసుకురావడం జరిగిందన్నారు. విశ్వవిద్యాలయంలో ఆధారిత నెట్‌వర్కింగ్‌ను సమగ్రపరచడం ద్వారా, ప్రపంచవ్యాప్తంగా పరిశ్రమలను రూపొందిస్తున్న సాంకేతికతలకు మా విద్యార్థులు ప్రత్యక్షంగా బహిర్గతం అయ్యేలా మేము నిర్ధారిస్తున్నాము. ఈ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ మౌలిక సదుపాయాలతో పాటుగా ఇది విద్యార్థులను నూతన ఆవిష్కరణలు ఆవిష్కరించడానికి, నాయకత్వం వహించడానికి మరియు ప్రపంచ డిజిటల్ నాయకులుగా మారడానికి సాధికారత కల్పించడం కొరకు సహాయపడుతుందన్నారు.

జైపూర్ రగ్స్ 'రగ్ ఉత్సవ్' ప్రారంభం

విశాలాంధ్ర- విజయవాడ: జైపూర్ రగ్స్ రగ్ ఉత్సవ్ ప్రారంభించామని జైపూర్ రగ్స్ డైరెక్టర్ యోగేష్ చౌదరి తెలిపారు. ఈ రగ్ ఉత్సవంలో చేతితో తయారు చేసిన 14 వేలకు పైగా రగ్స్ ప్రదర్శనలో కలవన్నారు. భారతీయ నేతదారులు మన సంప్రదాయ ఆత్మను ఆధునిక డిజైన్‌తో తీర్చిదిద్దారన్నారు. ఈ సారి ఉత్సవం మరింత వైభవంగా ఉందన్నారు. ఈ ఏడాది రగ్ ఉత్సవ్ 2025లో ప్రత్యేకంగా ఎంపిక చేసిన కలెక్షన్‌లో ఆలం, జెనెసిస్, సవానా, కన్ఫ్లక్షన్, దా హస్, ఫుందర్‌కమ్మేర్, కాలిడో, క్లాన్, బేసిస్, లాకునా, ఎర్తే, ఇండస్‌బార్, నోమాడిక్ థ్రెడ్స్, అకార్, కాంటూర్ వంటి సిగ్నేచర్ కలెక్షన్‌లు ఉన్నాయన్నారు. గ్రామీణ కళాకారుల ఊహశక్తి నుంచి నేరుగా పుట్టుకొచ్చిన సుమారు 200 ప్రత్యేకమైన మంచాహా రగ్స్ కూడా ఈ వేడుకలో ప్రధాన ఆకర్షణ అన్నారు. ఈ సమయంలో మొదటిసారి మొత్తం కలెక్షన్‌పై 60 శాతం వరకు తగ్గింపు అందిస్తున్నామని పేర్కొన్నారు.

రంగారావు మాస్టారుకు సన్మానం



విశాలాంధ్ర-కంచికచర్ల : కంచికచర్ల పరిసర ప్రాంతాల్లో విద్యారంగానికి రంగారావు మాస్టారు చేసిన సేవలు నిరుపమానమైనవని కంచికచర్ల ప్రెస్ క్లబ్ సభ్యులు పలువురు పేర్కొన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని కంచికచర్ల మార్కెట్ యార్డ్ కార్యాలయంలో కంచికచర్ల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గంగిరెడ్డి రంగారావు మాస్టార్‌ని కంచికచర్ల ప్రెస్ క్లబ్ సభ్యులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. తోట క్రాంతి, మట్టిపల్లి బాలకృష్ణ, కొండవీటి రాధా కృష్ణ, కందిమళ్ళ భవాని, బొక్కా రవికుమార్, సుమన్ దేవ్, జల్లా హనుమంతురావు, బొక్కా నాగేశ్వర రావు, కట్టా తిరుపతి రావు, బొక్కా శ్రీకాంత్, అనుముల రంగారావు, గోపి తదితరులు పాల్గొన్నారు.

విశ్వమాత మదర్ థెరిస్సా వర్ధంతి

విశాలాంధ్ర-మాచర్ల : విశ్వమాత మదర్ థెరిస్సా 28వ వర్ధంతిని మదర్ థెరిస్సా సేవా సమితి అధ్యక్షులు గాదె కిరీటి రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలో నిర్వహించారు. ముందుగా మదర్ థెరిస్సా విగ్రహానికి కమిటీ సభ్యులు పూలమాలలతో నివాళులర్పించారు. అనంతరం గాదె కిరీటిరెడ్డి మాట్లాడుతూ మదర్ థెరిస్సా అనేకమంది కుష్టు రోగులకు, వికలాంగులకు, వృద్ధులకు సేవ చేసినట్టు తెలిపారు. అంతేకాకుండా ఒక ఉపాధ్యాయురాలుగా అందరికీ ఆదర్శంగా నిలిచి పాఠాలు బోధించే మంచి పేరు ప్రఖ్యాతలు సంపాదించుకున్నట్లు పేర్కొన్నారు. విదేశీ వనితై మనదేశంలో మురికివాడల్లో సేవ చేసినందుకు ముందుకు వచ్చిందన్నారు. ఆ మహనీయురాలి సేవలకు గుర్తింపుగా భారతరత్న, నోబెల్ శాంతి బహుమతితోపాటు సుమారు 160 దేశాలు అవార్డులతో సత్కరించినట్టు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు న్యాయవాది చిలమకూరి నాగిరెడ్డి, కుర్రి సాయి మార్కొండారెడ్డి, కసిరెడ్డి శాంతిరెడ్డి, అందుగుల చంద్రయ్య, ముత్యాల పాపిరెడ్డి, ఈశ్వర్ రెడ్డి, లాయర్ అందుగుల బాలజోజి, జె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

యథావిధిగా కొల్లి శారద హోల్ సేల్ కూరగాయల మార్కెట్

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: గుంటూరు నగరంలో నగరపాలక సంస్థ కొల్లి శారద హోల్ సేల్ కూరగాయల మార్కెట్ యథావిధిగా కొనసాగుతుందని, రైతులు కేవలం ఈ మార్కెట్ లోనే కూరగాయల క్రయ, విక్రయాలు చేసుకోవాలని, నగరంలో అనుమతి లేని ప్రాంతాల్లో విక్రయించిన యెడల చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. నగరంలో జాతీయ రహదారి సర్వీస్ రోడ్లలో, అన్నపూర్ణ కాంప్లెక్స్ పరిసర ప్రాంతాల్లో నగరపాలక సంస్థ అనుమతి లేకుండా రాత్రి వేళలలో హోల్ సేల్ కూరగాయల విక్రయాలు జరుగుతున్నాయని ఫిర్యాదులు అందాయన్నారు. అనుమతి లేని హోల్ సేల్ కూరగాయల క్రయ విక్రయాలు చట్టప్రకారం నిషేధమని, రైతులు దళారుల మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. ఇప్పటికే జిల్లా పోలీస్ అధికారులకు, జాతీయ రహదారి నిర్వహణ, మార్కెటింగ్ శాఖ అధికారుల దృష్టికి ఫిర్యాదులను తీసుకెళ్లామన్నారు. రైతులను హోల్ సేల్ మార్కెట్ అంశంపై గందరగోళ ప్రకటనలు చేస్తున్న దళారులపై నగరపాలక సంస్థ వైపు నుండి కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

వేడుకగా గురుపూజోత్సవం

విశాలాంధ్ర-అమరావతి : విద్యార్థులను దేశ పౌరులుగా తీర్చిదిద్దటంలో ప్రధాన భూమిక నిర్వహించే ఉపాధ్యాయులు ప్రముఖ పాత్ర నిర్వహిస్తారనడంలో సందేహం లేదు. ఇందులో భాగంగానే సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి సందర్భంగా మండల కేంద్రమైన అమరావతిలోని శ్రీ రామకృష్ణ హిందూ హైస్కూల్ ఆర్‌వీవీఎన్ కాలేజీ, వివిధ పాఠశాలలతో పాటు మండల పరిధిలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో గురుతర బాధ్యత కలిగిన ఉపాధ్యాయులను విద్యార్థులు గురుపూజోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సిబార్‌లో ఘనంగా టీచర్స్ డే వేడుకలు

విశాలాంధ్ర-పెదకాకాని : మండల పరిధిలోని తక్కెళ్ళపాడు గ్రామంలో గల సిబార్ దంత వైద్య కళాశాలలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినం సందర్భంగా టీచర్స్ డే కార్యక్రమం ఎంతో వైభవంగా జరిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా కళాశాల డీన్ డాక్టర్ ఎల్.కృష్ణ ప్రసాద్ గురువులు, జువాలజీ అధ్యాపకులు, శారద ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్ అడ్వైజర్ ఈఎస్ఆర్‌కే ప్రసాద్, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రమణారెడ్డి గురువులు, మద్రాసు రాగాస్ డెంటల్ కాలేజీ ఓరల్ పెథాలజీ విభాగపు హెచ్ఓడీ డాక్టర్ రంగనాథన్ కన్నన్ విచ్చేశారు. ఈఎస్ఆర్‌కే ప్రసాద్ మాట్లాడుతూ తన 56 సంవత్సరాల అపారమైన అనుభవాన్ని సిబార్ కళాశాలలోని విద్యార్థులతో పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వ్యవస్థాపక డైరెక్టర్ ఎల్.సుబ్బారావు, డైరెక్టర్ టి.కృష్ణమోహన్, వైస్ డీన్ డాక్టర్ మన్నే ప్రకాష్, డెంటల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా మెంబర్ డాక్టర్ పి.రేవతి, కళాశాలలోని అధ్యాపకులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. టీచర్స్ డే సందర్భంగా సిబార్ దంత వైద్య కళాశాల యాజమాన్యం వారు కళాశాలలో విశిష్ట సేవలు అందించిన, దేశంలోని స్పెషాలిటీ అసోసియేషన్స్‌లోని పాలకమండలిలో విశిష్ట స్థానం పొందిన అధ్యాపకులను ప్రశంసా పత్రాలతో సన్మానించారు.

యువతతోనే దేశ భవిష్యత్

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: భారత్ ఉజ్వల భవిత యువత భుజస్కంధాలపై ఉందని ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. శుక్రవారం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని భాష్యం మెడెక్స్ ఆధ్వర్యంలో స్థానిక ఏటుకూరు రోడ్డులోని వివాహ కన్వెన్షన్ సెంటర్లో జరిగిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ నలంద, తక్షశిల వంటి విశ్వ విద్యాలయాల ద్వారా ప్రపంచ మానవాళికి జ్ఞానమందించిన ఘనమైన మన భారత సంస్కృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. రాబోవు రోజుల్లో విద్యావ్యవస్థలో సంస్కరణల ద్వారా పెను మార్పులను ప్రతి ఒక్క విద్యార్థి ఆకళింపు చేసుకుంటూ వికసిత్ భారత్ నిర్మాణానికి కృషి చేయాలన్నారు. దేవుడి పట్ల ఎంత భక్తి, గౌరవం ఉంటాయో జ్ఞానాన్ని అందించే గురువుపై కూడా అంతే శ్రద్ధాభక్తులు ఉండాలన్నారు. నాణ్యమైన విద్యనందించేందుకు ప్రభుత్వం సంసిద్ధంగా ఉందని ఈ అవకాశాన్ని ప్రతి ఒక్క విద్యార్థి అందిపుచ్చుకుని ఉత్తమైన వైద్యులుగా రాణించాలని ఆకాంక్షించారు. మరో అతిథి ఆస్టర్ రమేష్ హాస్పటల్స్ అధినేత, కార్డియోలజిస్ట్ డాక్టర్ పోతినేని రమేష్ బాబు మాట్లాడుతూ వైద్యరంగంలో కృత్రిమ మేధ ద్వారా సంభవిస్తున్న అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని నేటి యువత అందిపుచ్చుకుని అవగాహన

భాష్యం మెడెక్స్ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో మంత్రి

చేసుకుని నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలన్నారు. జీజీహెచ్ నాట్కో క్యాన్సర్ సెంటర్ అంకాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నల్లబోతు మురళి మాట్లాడుతూ దేశ నిర్మాణంలో ఎంతో మంది ఇంజినీర్లను, వైద్యులను అందించిన ఘనత భాష్యం విద్యాసంస్థలకే దక్కుతుందన్నారు. భాష్యం విద్యాసంస్థల ఛైర్మన్ భాష్యం రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థినీ, విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపేందుకు జీవితంలో ఎంతో సాధించిన ప్రేరణాత్మకమైన వ్యక్తులను మీకు పరిచయం చేయడం జరుగుతుందన్నారు. వారి అనుభవసారాన్ని వినమ్రంగా గ్రహించి మీ లక్ష్యసాధనకు కృషిచేయాలని విద్యార్థులకు సూచించారు. సభకు భాష్యం మెడెక్స్ ప్రిన్సిపాల్ హరిబాబు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో భాష్యం విద్యాసంస్థల వైస్ ఛైర్మన్ భాష్యం హనుమంతరావు, మేనేజింగ్ డైరెక్టర్ భాష్యం సాకేత్ రామ్ తదితరులు పాల్గొన్నారు.

తురకపాలెంలో స్థితిగతులను పరిశీలించిన మంత్రి పెమ్మసాని

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: గుంటూరు రూరల్ మండలం తురకపాలెంలో స్థితిగతులను, రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన హెల్త్ క్యాంప్ ను గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, స్థానిక ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులుతో కలిసి శుక్రవారం పరిశీలించారు. హెల్త్ క్యాంపు ద్వారా అందుబాటులో ఉంచిన మెడిసిన్స్, పరీక్ష యంత్రాలు తదితరాల గురించి వైద్య సిబ్బందిని ఆయన అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక ప్రజలతో మాట్లాడి అక్కడికి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఇటీవల మరణించిన వారి కుటుంబ సభ్యులను స్థానిక ఎమ్మెల్యే బి.రామాంజనేయులు తో కలిసి పెమ్మసాని పరామర్శించారు. అనంతరం పెమ్మసాని మీడియాతో మాట్లాడారు. తాగునీరు వల్ల ఈ వ్యాధి వస్తుంది అనడం అనేది కరెక్ట్ కాదన్నారు. ఇవన్నీ పూర్తిగా అపోహలు. వీటిని నమ్మవద్దు. అరుదైన వ్యాధి కావడం ఎవరికి సరైన అవగాహన లేకపోవడం, తెలుసుకునేందుకు కొంత సమయం పట్టడం వల్ల ఇలాంటి అపోహలు వ్యాప్తి చెందాయి, తప్ప ఇందులో నిజం లేదన్నారు. ఈ ప్రాంతంలో ఎవరెవరైతే ఇబ్బంది పడుతున్నారో, వారికి మళ్ళీ బ్లడ్ కల్చర్ తీసి సవివరమైన రికార్డులు సేకరించి, అవసరమైన వారిని హాస్పిటల్లో అడ్మిట్ చేసి జాగ్రత్తగా తీసుకోవడం మా బాధ్యతగా తీసుకుంటామన్నారు. మరణించిన వారి కుటుంబాలకు ఏ విధంగా ఆర్థిక సాయం చేయాలనేది ప్రభుత్వంతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామన్నారు.

కొమ్మారెడ్డి ఆధ్వర్యంలో వైభవంగా గణేష్ ఊరేగింపు

విశాలాంధ్ర-తాడేపల్లి : మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని గుండిమెడలో కొమ్మారెడ్డి కిరణ్ ఆధ్వర్యంలో గణేష్‌ను ఏర్పాటు చేశారు. తొమ్మిది రోజుల పాటు పూజలందుకున్న గణనాథున్ని శుక్రవారం గుండిమెడలో ఊరేగించారు. లడ్డు వేలం పాట జరిగింది. ఈ వేలం పాటలో 5 కేజీల లడ్డును కొమ్మారెడ్డి వెంకటేశ్వరరావు బుజ్జి రూ.77,777లకు పాడుకున్నారు. ఈ కార్యక్రమంలో కొమ్మారెడ్డి కిరణ్ మాట్లాడుతూ అన్ని విఘ్నాలను తొలగించే గణేశున్ని నిత్యం పూజించడం, స్మరించడం ఎంతో ఉత్తమమని అలాంటి మూర్తిని తొమ్మిది రోజుల పాటు పూజించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పద్మశాలి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య, స్వచ్ఛ ఆంధ్ర డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ ఆరుద్ర భూలక్ష్మి, గుండిమెడ టీడీపీ గ్రామ పార్టీ అధ్యక్షులు గురుపాటి సుబ్బారావు, తెలుగు రైతు గుంటూరు జిల్లా అధ్యక్షులు కళ్ళం రాజశేఖర్ రెడ్డి, పెనుమాక పీఏసీ చైర్మన్ కళ్ళం శివ గోవిందరెడ్డి, ఇప్పటం పీఏసీ చైర్మన్ పోకల బాపయ్య, కాట్రగడ్డ మధుసూదన్ రావు, సీనియర్ న్యాయవాది సుధాకర్ రెడ్డి, వడ్డేశ్వరం ప్రసాదరావు, బీజేపీ నాయకులు మేకల లక్ష్మణ్, కొల్లి సురేష్, నల్లిబోయిన శ్రీనివాసరావు, కాసారగడ్డ శ్రీనివాసరావు, అనుమోలు వీరాంజనేయ ప్రసాద్, సుబ్రహ్మణ్యం, మొక్కపాటి యేసు, ప్రసాద్, పాడిబండ్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో గంజాయి ముఠా

విశాలాంధ్ర-అమరావతి : నానాటికి జిల్లాలో గంజాయి ముఠా విజృంభించడంతో ఎస్పీ సతీష్ కుమార్ ఆదేశాల మేరకు పెదకాకాని పోలీసులు తమ నిఘాను విస్తృతం చేశారు. పెదకాకానిలోని జాన్ ఆఫర్ కాలనీలో గంజాయి కార్యకలాపాలకు పాల్పడుతున్నారని సమాచారం అందడంతో నిఘా పెట్టిన పోలీసులు శుక్రవారం ఉదయం ఆరుగురిని అదుపులోని తీసుకొని విచారిస్తున్నారు. వీరిలో ఒకరు హైదరాబాద్‌కు సంబంధించిన యువకుడు కాగా మిగిలినవారు పెదకాకానికి చెందిన యువకులుగా గుర్తించారు.

వైసీపీ కార్యకర్తల అక్రమ అరెస్టులపై ఖండన

విశాలాంధ్ర-వినుకొండ: వినాయక నిమజ్జనాలలో టిడిపి నాయకుల అరాచకాలు సాగిస్తూ వైసిపి నేతలను అక్రమ అరెస్టులు చేయడంపై ప్రముఖ న్యాయవాది, పల్నాడు జిల్లా అధికార ప్రతినిధి ఎం.ఎన్. ప్రసాద్ తీవ్రంగా ఖండించారు. వినాయక చవితిని పురస్కరించుకుని వినుకొండ నియోజకవర్గం, శావల్యాపురం మండలంలోని కారుమంచి గ్రామంలో వినాయక నిమజ్జనాలు జరుగుతున్న నేపథ్యంలో గురువారం రాత్రి నిమజ్జనం సందర్భంగా గ్రామంలో టిడిపి నేతలు వైసిపి శ్రేణుల ఇళ్లమీదకు వెళ్లి రాళ్లతో, కర్రలతో దాడి చేశారని, ఈ దాడి మొత్తాన్ని గమనించిన వీడియోలు చిత్రీకరించిన పోలీసులు వాటిని ప్రదర్శించకుండా ఏకపక్షంగా దాడుల్లో గాయపడ్డ వైసిపి నేతల్ని అరెస్టు చేయడం అరాచక పాలనకు నిదర్శనం అని ఆయన పేర్కొన్నారు. కారుమంచి గ్రామానికి చెందిన మాజీ సొసైటీ అధ్యక్షుడు బొల్లా శివను మరియు వైసీపీ కార్యకర్తలను దాదాపు పది మందిని శుక్రవారం తెల్లవారు జామున 3:30 గంటలకు అక్రమ అరెస్టు చేసి ఏ పోలీసు స్టేషన్లో ఉంచారో కూడా కుటుంబ సభ్యులకు తెలపలేదన్నారు. అక్రమంగా పోలీసులు అరెస్ట్ చెయ్యటం దారుణమని, కూటమి నాయకుల మెప్పుకోసం పోలీసులు ఇలాంటి అక్రమ అరెస్టులు చేయటం సరికాదని, అరెస్ట్ అయిన వైసీపీ నేతలను వెంటనే విడుదల చేయాలని, దాడులకు కారకులైన టిడిపి నేతలను వెంటనే శిక్షించాలని, వాస్తవాలను చిత్రీకరించిన వీడియోలను పోలీసులు బయటపెట్టాలని డిమాండ్ చేశారు. లేని పక్షాన ఆందోళనకు దిగుతామని, అవసరమైతే న్యాయస్థానంలో తేల్చుకుంటామని ప్రసాద్ హెచ్చరించారు. నియోజకవర్గంలో ప్రతిచోట టీడీపీ అరాచక పాలన సాగిస్తుందని, త్వరలోనే ప్రజలు బుద్ధిచెప్పే రోజులు దగ్గర పడ్డాయని ఆయన వ్యాఖ్యానించారు. వైసీపీ ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పార్టీ తరఫున ఆయన భరోసా కల్పించారు. అలాగే బాధిత కుటుంబాల మహిళలు తమవారిని విడిచి పెట్టాలని శుక్రవారం నాడు వినుకొండ రూరల్ పోలీస్ స్టేషన్ కు పెద్ద ఎత్తున తరలి వచ్చారు.